# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయుల కరదీపిక

## 3వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడసాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారంనడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. “అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను” అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసిపనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమైతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగైతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువలపతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్యాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర

విద్యాప్రణాళిక పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టితో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణతీరుతెన్నులను గురించి "ఉపాధ్యాయులకు సూచనలు" కూడా చేర్చారు. అట్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

తేది : 30-05-2014

స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, పరితోషాఽం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** ఉపాధ్యాయిని, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వి. స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుడూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.
**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.
**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.
**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.
**డా॥ గుడిసేన విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.
**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.
**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.
**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,**
ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,** సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య - జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.

**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలీస్, థానే, మహారాష్ట్ర.

**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.

**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.

**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.

**శ్రీ ఫాదర్ పల్లిదాసు,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూర్పు గోదావరి జిల్లా.

**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.

**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో-ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.

**శ్రీ శిథికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**శ్రీ రవీందర్,** కో-ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.

**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎన్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య - జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

తేది : 30-05-2014

స్థలం : హైదరాబాద్.

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, ఆం.ప్ర., హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య - జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 1 నుండి 5 తరగతులకు వారానికి 42 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో సబ్జక్టుల వారీ భారత్వం కింది విధంగా ఉంటుంది.

| | | |
|---|---|---|
| మాతృభాష (తెలుగు / ఉర్దూ) | - | 12 పీరియళ్ళు |
| గణితం | - | 12 పీరియళ్ళు |
| ఆంగ్లం | - | 6 పీరియళ్ళు |
| పరిసరాల విజ్ఞానం | - | 6 పీరియళ్ళు |
| విలువలవిద్య, జీవననైపుణ్యాలు | - | 1 పీరియడ్ |
| శారీరక, ఆరోగ్యవిద్య | - | 2 పీరియళ్ళు |
| కళలు, సాంస్కృతికవిద్య | - | 2 పీరియళ్ళు |
| పని, కంప్యూటర్ విద్య | - | 1 పీరియడ్ |
| **మొత్తం** | **-** | **42 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య - జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమైతాయి.

- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  •) పాఠం పేరు, •) ప్రధానవిలువ, •) ఉపవిలువ, •) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, •) ఉపోద్ఘాతం, •) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, •) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', •) సూక్తి.

- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.

- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.

- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.

- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తుపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.

- పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 – 91%

  A2 – 71% – 90%

  B1 – 51% – 70%

  B2 – 41% – 50%

  C – 0 – 40%

- పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం – ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి – ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం – జట్టుపని'**ని తరగతిలో పిల్లను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- పాఠశాలలో **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- 'విలువల విద్య – జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనుల చేయించడం, 'ఆచరించండి – అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్చవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | ఒకరి స్వేచ్ఛ ఇతరులకు ఆటకం కల్గించకుండా ఉండటం | ఎవరికీ ఆటంకం కారాదు | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | స్వేచ్ఛ వల్ల సంతోషం కలుగుతుందని చెప్పడం | స్వేచ్ఛలోని ఆనందం | 4 |
| 3. | శీల నిర్మాణం | కృతజ్ఞత భావంకలిగి ఉండటం | కృతజ్ఞత | 7 |
| 4. | జీవన నైపుణ్యాలు | చిరునవ్వుతో పలకరించడం | చిరునవ్వు | 11 |
| 5. | బాధ్యతవహించడం | ఇంటిపనిలో సహాయపడటం | నేనూ పనులు చేస్తా | 14 |
| 6. | పొదుపు చేయడం | నీటిని పొదుపుగా వాడటం | నీటి విలువ | 19 |
| 7. | ఆరోగ్య విలువలు | వ్యక్తిగత పరిశుభ్రత | వ్యక్తిగత పరిశుభ్రత | 23 |
| 8. | సంస్కృతి, సంప్రదాయాలపట్ల గౌరవం | పెద్దలను గౌరవించడం | పెద్దలను గౌరవిస్తాం | 26 |
| 9. | పర్యావరణ పరిరక్షణకు తోడ్పడం | చెత్తబుట్టప్రాధాన్యతను తెలుసుకోవటం, వినియోగించటం | చెత్తబుట్ట వాడుదాం | 30 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | నిజాయితీగా అంగీకరించడం | నిజాయితీగా ఉందాం | 34 |
| 11. | న్యాయం | జంతువుల పట్ల అన్యాయంగా ప్రవర్తించడాన్ని ప్రశ్నించడం | అన్యాయం | 37 |
| 12. | శాంతి / కలిసి మెలిసి జీవించడం | ప్రకృతిలోని జీవజాలానికి బాధ కలగకుండా చూడడం. | వాటికీ బాధ కల్గుతుంది | 41 |


## అనుబంధం


1. శ్లోకాలు 47
2. పద్యాలు 48
3. పాటలు, గేయాలు 50
4. కథలు 57
5. స్ఫూర్తిదాతలు 67

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య – జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించడండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయుల పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీరు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య – జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# 1 ఎవరికీ ఆటంకం కారాదు

| | | |
|---|---|---|
| I. ప్రధాన విలువ | → | స్వేచ్ఛ |
| II. ఉప విలువ | → | ఇతరుల పనులకు ఆటంకం కలిగించకుండటం. వారి భావాలను గౌరవించడం |
| III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు | → | ♦ ఇతరుల స్వేచ్ఛను అడ్డుకోరాదని తెలుసుకోవడం.<br>♦ ఇతరుల భావాలను గౌరవించాలని తెలుసుకోవడం. |

## IV. ఉపోద్ఘాతం

ప్రతి జీవి స్వేచ్ఛను కోరుకుంటుంది. ప్రతీ వ్యక్తి స్వేచ్ఛను కోరుకుంటారు. అయితే ఆ స్వేచ్ఛ ఇతరుల పనులకు, ఇతరుల స్వేచ్ఛకు ఇబ్బంది కలిగించకుండా ఉండాలి. వారి అవసరాలను గుర్తించాలి. వారి భావాలను గౌరవించాలి. మనం ఆనందం పొందడం కోసం ఇతరులకు ఇబ్బంది కలిగించరాదు. అలా కాకుండా ఎక్కువ మంది తమకు తెలియకుండానే ఇతరుల పనులకు ఆటంకం కలిగిస్తూ వారి స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో ఈ సంఘటనలు చూడండి.

## V. సంఘటనలు

### సంఘటన - 1

చాలా మంది తమకు తెలియకుండానే ఇతరులకు ఇబ్బంది కలిగిస్తుంటారు. వాళ్ళ అలవాటు వల్ల ఇతరులకు చాలా అసౌకర్యం కలుగుతుంది. ఈపరిస్థితి ఒక్కొక్కసారి చాలా ఎక్కువగా కూడా ఉంటుంది. ఎలా అంటారా? కింది సంఘటనను వినండి.

వేణు 10వ తరగతి చదువుతున్నాడు. సంవత్సర పరీక్షలు జరుగుతున్నాయి. వేణు పరీక్షకోసం చదువుకొంటున్నాడు.

వేణువాళ్ళ ఇల్లు నాలుగిళ్ళ లోగిళ్ళలో ఉంది. పక్కింటి కాంతమ్మకు పొద్దస్తమానం టి.వి. చూసే అలవాటు ఉంది. అదికూడ ఎక్కువ శబ్దంతో వింటుంది. వేణు చదువుకోవాలని పుస్తకాలను ముందేసుకొని కూచున్నాడు.. కానీ పక్కింటి నుండి వచ్చే టి.వి. శబ్దాల వల్ల చదవడానికి అతని మనసు కుదరడంలేదు. వేణుకి కోపంవచ్చి, శబ్దకాలుష్యం మీద ఉపన్యాసం ఇవ్వాలనుకొన్నాడు. కాని తనకు కలుగుతున్న ఇబ్బందిని సౌమ్యంగా కాంతమ్మకు తెలియజేశాడు వేణు. ఆ మాటలు ఆమె చెవికెక్కలేదు. పైగా "నాఇంట్లో నేను టి.వి. చూస్తుంటే నీసొమ్మేమి పోయింది" అంటూ దబాయించింది. చూశారా! కాంతమ్మ తనకున్న అలవాటు వల్ల కలుగుతున్న ఇబ్బందిని గుర్తించలేదు. వేణుకు పరీక్షలు జరుగుతున్నాయని కూడా ఆమె ఆలోచించలేదు. ఇలా చేయడం మంచిదేనా? ఆలోచించండి.

### సంఘటన - 2

అదొక ప్రాథమిక పాఠశాల, 3వతరగతి పిల్లలకు ఉషాటీచర్ పాఠం చెబుతున్నారు. పక్కనే ఉన్న 4వ తరగతికి ఆ రోజే భాస్కర్ సార్ రాలేదు గనుక, ఆ తరగతి పిల్లలందరూ గ్రంథాలయ పుస్తకాలను తీసుకొని చదువుకుంటున్నారు. అందులో కుమార్ అనే విద్యార్థి మాత్రం అదేపనిగా కథను గట్టిగా చదువుతున్నాడు. దీంతో మిగిలిన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. వారు సరిగ్గా చదువలేకపోతున్నారు. కొంత మంది పిల్లలు అల్లరి చేస్తూ పెద్దగా అరుస్తున్నారు. అందులో ఇద్దరు పిల్లలు పోట్లాడుకొని ఏడుస్తున్నారు. ఇదంతా 3వ తరగతి పిల్లలకు ఇబ్బంది కలుగుతోంది.

ఇలా తరగతిలో అల్లరి చేయడం, అదేపనిగా ఇతరులకు ఇబ్బంది కలిగేలా పెద్దగ చదవడం సరైనదేనా?

### సంఘటన - 3

వారంరోజుల్లో దీపావళి పండుగ వస్తోంది. అప్పుడే పిల్లల్లో సంబరం మొదలైంది. వీధుల్లో పిల్లలు పెద్ద పెద్ద శబ్దాలు వచ్చే టపాసులు కాల్చుతున్నారు. ఇలా వీధిలో ఎక్కడపడితే అక్కడ టపాసులు కాల్చడం వల్ల వచ్చీ పోయే వారికి, వాహనాల్లో వెళ్ళే వారికి చాలా ఇబ్బందిగా ఉంది. పిల్లలు మాత్రం అదేం పట్టించుకోవడంలేదు. వాళ్ళసంబరంలో వాళ్ళు ఉన్నారు. గోల చేస్తున్నారు. ఇంతలో శీను వెలిగించిన రాకెట్ సరాసరి ఓ ఇంట్లోకి దూసుకెళ్ళింది. అంతే! పిల్లలంతా భయంతో పరారయ్యారు.

ఇది ఇలా ఉంటే ఊర్లో పెళ్ళి ఊరేగింపు మొదలయ్యింది. వాళ్ళ సంబరం కోసం. పెద్దపెద్ద గొనుసుల్లా ఉన్న టపాసులు కాల్చుతున్నారు. అవి విరామం లేకుండా టపటప మని శబ్దాలు చేస్తూ పేలుతున్నాయి. జనం

*చిందులు వేస్తున్నారు. ఈశబ్దాలకు చిన్నపిల్లలు భయపడి ఏడుస్తున్నారు. నిద్ర పుచ్చడానికి తల్లులు అవస్థపడుతున్నారు. ఈ పొగంతా చుట్టుముట్టింది. అరుగుమీద పడుకున్న తాతయ్య దీనికి ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. అదే పనిగా దగ్గుతున్నాడు.*

*ఇవేమీ పట్టని జనం మాత్రం ముందుకు సాగిపోయారు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మూడు సందర్భాలు గురించి తెలుసుకున్నారు కదా!
   ఇందులో ఎవరెవరికి ఇబ్బంది కలిగింది? ఇలా చేయడం మంచిదేనా?
2) మన స్వేచ్ఛవల్ల ఇతరులకు ఆటంకం కలిగించరాదు. ఎందుకు?
3) ఆటంకాలు ఎదురయ్యే సందర్భాలు ఏవి? అప్పుడు మనం ఎలా ప్రవర్తించాలి?

### తెలుసుకోండి

మన అలవాట్ల వల్ల ఇతరులు ఇబ్బంది పడే సందర్భాలు ఎన్నో ఉంటాయి. వాటిని పెద్దగా పట్టించుకోము. దాన్ని గురించి ఆలోచనకూడా చేయము. దీని గురించి మహాభారతంలో ఒక మంచి మాట చెప్పారు. “ఏ పనులు చేసినందువల్ల మనకు కష్టం కలుగుతుందో అటువంటి పనులు మనం ఇతరుల విషయంలో చెయ్యకూడదు”. మనిషి పాటించాల్సిన అన్ని ధర్మాలలో ఇదే ముఖ్యమైనది.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- స్వేచ్ఛకు ఆటంకాలు కలిగే సందర్భాల జాబితా తయారు చేయండి. వాటిని ఎలా సరిచేసుకోవాలో చర్చించండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

1) వారంరోజుల్లో మీకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలిగాయో గుర్తించండి. అప్పుడు మీరు ఏమిచేశారో చెప్పండి.
2) వారంరోజులు మీరు ఇతరులకు ఇబ్బంది కలగకుండా ప్రవర్తించండి. మీరు ఏమిచేశారో చెప్పండి.

**సూక్తి**

**ఇతరుల పనుల వల్ల మనకు ఏవైతే ఆటంకం కలుగుతుందని మనం అనుకుంటామో అటువంటివి ఇతరుల పట్ల మనం చేయరాదు.**

# 2 స్వేచ్ఛలోనే ఆనందం

**I. ప్రధాన విలువ** → సంతృప్తిగా జీవించడం

**II. ఉప విలువ** → స్వతంత్రంగా జీవించడం వల్ల సంతోషం కలుగుతుందని తెలియజేయడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- స్వేచ్ఛగా ఉండడం వల్ల సంతోషం కలుగుతుందని తెలియజేయడం.
- స్వతంత్రంగా ఉండడం వల్ల ఆనందం పొందుతామని తెలియజేయడం.

## IV. ఉపోద్ఘాతం

సృష్టిలోని ప్రతి జీవికి స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించే హక్కు ఉంది. స్వతంత్రత కోల్పోతే అన్నీ కోల్పోయినట్లుగా ఉంటుంది. మనుషులే కాదు పశుపక్షాదులన్నిటికి స్వతంత్రత ఉంటుంది. స్వతంత్రంగా జీవించడం వల్ల సంతోషం కలుగుతుంది. అలా కాకుండా ఎన్ని సౌకర్యాలు సమకూర్చినా స్వతంత్రత లేకుంటే ఆనందం కలగదు.

## V. సంఘటనలు

*సంఘటన - 1*

*గంగాధర్ దంపతులు నిజామాబాదులో నివాసముంటున్నారు. వాళ్ళకు ఒక్కడే సంతానం అనిరుధ్. అనిరుధ్‌ను మంచి పాఠశాలలో చేర్పించి చదువు చెప్పించాలని అనుకున్నారు. అనిరుధ్‌కి అక్కడ తన స్నేహితులలో కలిసి ఆడుకోవడం ఇంట్లో సందడి చేయడం ఇష్టం. కాని చదువు కోసం అమ్మానాన్నలు అతనిని హైదరాబాదులోని మంచి పాఠశాలలో చేర్పించారు. విశాలమైన పాఠశాలభవనం, ఇంట్లో కన్నా మంచి వసతులున్న హాస్టల్, మంచి భోజనం ఉన్నాయి. వారానికోసారి అమ్మనాన్నల్లో ఒకరు వచ్చి చూసి వెళ్తూ ఉంటారు. అపుడు వారిలో కాసేపు బయటకు వెళ్ళే అవకాశం ఇస్తారు. అనిరుధ్ ప్రతివారం వాళ్ళ అమ్మానాన్న వచ్చేరోజు కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. వాళ్ళు వెళ్ళిపోగానే మళ్ళీ దిగాలుగా మారిపోతాడు. పాఠశాలకు సెలవులిచ్చారు. సెలవుల్లో ఇంటికి రాగానే అనిరుధ్‌కు రెక్కలొచ్చినట్లయింది. సెలవులు త్వరగా గడిచాయి. మళ్ళీ బడికి వెళ్ళాల్సిన సమయం వచ్చింది. అనిరుధ్ మాత్రం తానక్కడ చదువుకోనని ఇక్కడే ఇంటి వద్ద ఉండి స్కూల్‌కి వెళ్తానని మొండి పట్టు పట్టాడు.*

*సంఘటన - 2*

*సుధాకర్‌ది ఒక పల్లెటూరు. వాళ్ళ అమ్మానాన్నలకు వయసు మీద పడుతోంది. సుధాకర్ బాగా కష్టపడి చదివి ఉన్నతోద్యోగం సంపాదించాడు. ఇప్పటివరకు అరకొర సదుపాయాలున్న పల్లెటూరిలోని ఇంటిని వదిలి పట్టణంలోని అపార్ట్‌మెంటుకు మారారు. అక్కడ అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయి. సుధాకర్ వాళ్ళ అమ్మానాన్నలను కూడా తనతోపాటే పట్టణానికి తీసుకువెళ్ళాడు. అక్కడ వాళ్ళకు అన్ని రకాల వసతులున్న ఇంటిని చూసి ఆనందించారు. సుధాకర్ ఆఫీసు వెళ్ళగానే వీరికి కాలక్షేపం కొరకు టి.వి. చూస్తూ కూర్చునేవారు. టి.వి ఎంతసేపని చూస్తారు? అలా బయటకు వెళ్దామని వస్తే అపార్టుమెంటులో అంతా ఉద్యోగస్తులే కావడంతో ఎవరూ ఉండేవారు కాదు. ఊరు చూద్దామంటే ఎటువెళ్ళాలో, ఎలా వెళ్ళాలో తెలియదు. వారం పాటు గడిచాక వాళ్ళు సుధాకర్‌తో తమ సొంత ఊరికే వెళ్తామని తననే అక్కడికి వారంకోసారి వచ్చి చూడమని చెప్పారు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) అనిరుధ్‌కు హాస్టల్‌లో అన్ని వసతులున్నా ఆనందంగా సంతృప్తిగా ఎందుకు లేదు?

2) సుధాకర్ వాళ్ళ అమ్మానాన్నలు అన్ని సౌకర్యాలున్నప్పటికీ తమ సొంత ఊరికే వెళ్తామని ఎందుకనుకున్నారు?

3) స్వేచ్ఛకోల్పోతే ఎలా ఉంటుంది?

### తెలుసుకోండి

మనిషి స్వతంత్రంగా జీవించాలని కోరుకుంటాడు. తన మనస్సుకు నచ్చినవి, ఆనందం కలిగించేది చేయగలగడమే స్వతంత్రత, స్వేచ్ఛ. అయితే మనకు అన్ని సౌకర్యాలు కల్పించి జైలు లాంటి గదిలో ఉంచుతామంటే ఆనందంగా ఉండగలమా? స్వతంత్రత లేకపోతే ఆనందం ఉండదు.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- విద్యార్థులను జట్లుగా చేసి వారితో కింది అంశాలు చర్చించి మాట్లాడించాలి.

1) ఎక్కడెక్కడ, ఎవరెవరి దగ్గర స్వేచ్ఛగా ఉంటున్నారు? ఎందుకు?

2) ఎక్కడెక్కడ, ఎవరెవరి దగ్గర స్వేచ్ఛగా ఉండలేకపోతున్నారు? ఎందుకు?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- విద్యార్థులను వారం రోజుల్లో తాము ఇంట్లో ఎప్పుడెప్పుడు స్వేచ్ఛగా ఉంటున్నారో! ఎప్పుడెప్పుడు స్వేచ్ఛగా ఉండడం లేదో చెప్పమనాలి. చర్చించాలి.

### సూక్తి

ప్రకృతిలోని పక్షులు, జంతువులు ఎంత స్వేచ్ఛగా ఉంటాయో అంత ఆనందంగా జీవిస్తాయి. ఆనందం వలన తృప్తి కలుగుతుంది.

# 3 కృతజ్ఞత

**I. ప్రధాన విలువ** → శీల నిర్మాణం

**II. ఉప విలువ** → కృతజ్ఞతా భావం కలిగి ఉండడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- మేలు చేసిన వారిని మరిచిపోకూడదని తెలుసుకోవడం.
- మనుషుల పట్లనే గాక మనకు మేలు చేసే ప్రతి జీవికి, ప్రకృతిలోని అంశాలకి కృతజ్ఞతా భావం కలిగి ఉండాలని తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

మనిషికుండాల్సిన మంచి లక్షణాలలో ఒకటి కృతజ్ఞత. మనకు ఎవరి వల్లనైనా మంచి లేదా మేలు జరిగినపుడు ఆ మేలు చేసిన వారిని గుర్తుంచుకోవాలి. వారిని ఎప్పుడూ మరచిపోరాదు.

మనిషికి మనిషి వల్లనే మేలు జరగక్కరలేదు. మనిషికి మేలు చేసే వాటిలో పశుపక్షాదులు, చెట్లు, కొండలు, నదులు ఉన్నాయి. అవిచేసే మేలు కూడా మనం మరచిపోకూడదు. వాటికి అపకారం చేయకూడదు. వీలైనంత ఉపకారం చేయాలి. ఇవన్నీ కృతజ్ఞతా భావాలే.

## V. సంఘటనలు

### సంఘటన - 1

మన ఇంట్లో ఒక కొబ్బరి చెట్టు పెంచుతున్నామనుకోండి. ముందు దానికి చుట్టూ పాదు చేయాలి. రోజూనీరు పోయాలి. కొన్ని రోజులకి కంచె కట్టాలి. ఇలా రెండు మూడేళ్ళు జాగ్రత్తగా సేవచేస్తూ కాపాడితే మనం నీరుపోయాల్సిన అవసరం రాదు. అదే వేళ్ళ ద్వారా నీటిని పీల్చుకొని పెరగడం ప్రారంభిస్తుంది.

క్రమంగా ఒక్కో గుత్తికి 12 లేక 15 కాయలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. బాగా పెరిగిన ఒక్కో కాయలో సుమారు ఒక లీటరు చొప్పున తీయని నీటిని మోస్తూ మనకెప్పుడు ఇద్దామా అన్నట్లు ఎదురు చూస్తూ ఉంటుంది. ఎందుకంటే చిన్నప్పటినుండి జాగ్రత్తగా పెంచాము కదా! ఒక గెలకోస్తే నెలతిరక్కుండానే మరో గెలవేస్తుంది. ఇలా ఏడాదికి 12 గెలలకి తక్కువ కాకుండా వేస్తుంది. నెలకి ఒక గెల చొప్పున ఇస్తుంది. ఆకు ఈనెల ద్వారా కొబ్బరి చీపురు చేసుకోమంటుంది. కొబ్బరి పీచుతో మనకి చేసే ఉపకారాలకి లెక్కేలేదు. పీచుతో త్రాళ్ళు, కార్పెట్లు, బ్రష్‌లు వంటివి చేస్తారు. కొబ్బరి తినడానికి, నూనె తలకు రాసుకోవడానికి, వంటకు ఉపయోగిస్తారు. కొబ్బరి నీళ్ళు ఎంత మంచివి అంటే వైద్యులు గ్లూకోజ్ ద్రవంలా ఉపయోగిస్తారు. ఇలా నీళ్ళు ఒక కాయలోంచే కాదు, కాయ కాయలోంచి నీరు మనకి ఇస్తూనే ఉంటుంది. ఇలా కొబ్బరి తనను నాటిన వ్యక్తి ఎదురుగా ఉండవచ్చు, లేకపోవచ్చు, అయినా ఈ మానవులు నాకీ జన్మ ఇచ్చారే అనే కృతజ్ఞతతో తను జీవించి ఉన్నంత కాలం ఇలా మనకు అన్నీ ఇస్తూనే ఉంటుంది.

### సంఘటన - 2

రామయ్య, సీతమ్మ దంపతులు తమ ఒక్కగానొక్క కొడుకు రాజేష్‌ను బడిలో చేర్పించి చక్కగా చదివించారు. రాజేష్ స్వతహాగా తెలివైనవాడు. చదువులో ఎప్పుడూ ముందే. పై చదువులకి పట్నం వెళ్ళాల్సిన సమయం వచ్చింది. రాజేష్‌ను పట్నం పంపించారు. రాజేష్ వెళ్ళిన మొదట్లో ఉత్తరాలు తరచుగా రాసేవాడు. ఫీజుల వివరాలు పంపేవాడు. రామయ్య దంపతులు తమకున్న దాంట్లో అన్నీ తాకట్టు పెట్టి, అప్పుచేసి డబ్బు పంపుతూ ఉండేవారు, మళ్ళీ రెండుమూడు వారాలకే డబ్బు కావాలని ఉత్తరాలు వచ్చేవి. ఊళ్ళో నానామాటలు పడుతూ అడిగిన దాంట్లో సగం పంపగలిగేవాడు రామయ్య, రానురాను ఉత్తరాలు రావడం తగ్గింది. డబ్బులేక కొడుకు ఏమయ్యాడోనని తల్లిదండ్రులు దిగాలు పడేవారు.

రాజేష్ మాత్రం స్నేహితుల సాయంతో IAS పరీక్ష బాగా రాసి పాసయ్యాడు. ఇక్కడ రామయ్య దంపతులు కొడుకు గురించి బెంగతో ఉన్నారు. ఒకరోజు రాజేష్ IAS పరీక్ష పాసయి కలెక్టరు అయ్యాడని తెలిసి ఎంతో సంతోషించారు. సర్పంచి సాయంతో కొడుకును కలవడానికి వెళ్ళాడు. కలెక్టరు బంగళాలో రాజేష్ స్నేహితులతో మాట్లాడుతున్నాడు. రామయ్య చొరవతో 'ఒరేయ్ రాజేష్, ఎలా ఉన్నావురా!' అని ఆతృతతో, ఆప్యాయత ఉట్టిపడుతూ అడిగాడు.

*రాజేష్ స్నేహితులు రామయ్య వంక ఆదోలా చూస్తూ ఎవరితను అంటున్నట్లు చూశారు. రాజేష్ ఈ పల్లెటూరివాడు తన తండ్రి అని పరిచయం చేస్తే తన హోదా ఎక్కడ తగ్గిపోతుందోనని అనుకొని 'అతను మాతోటమాలి. నన్ను చిన్నప్పటి నుండి పెంచిన స్వతంత్రంతో అలా మాట్లాడాడు' అన్నాడు.*

*రామయ్యను పక్కకు తీసుకెళ్ళి ఏంటిది నాన్నా, వస్తున్నానని ఒక్కమాట చెప్పకుండా వచ్చేసావు. ఏంటీ వేషం? ఈ వేషంలో నా తండ్రివని చెప్తే నా పరువేం కావాలి. నా హోదా ఏం కావాలి? అన్నాడు.*

*రామయ్య కాళ్ళకింద భూమి కదిలినట్లయింది. కష్టపడి కొడుకును చదివిస్తే ఇలా జరిగిందే! అనుకుని బాధపడ్డాడు.*

## VI. అ) ఆలోచించడం – ప్రతిస్పందించడం

1) కొబ్బరి చెట్టు, రాజేష్‌లలో ఎవరు తాము పొందిన మేలును మరిచిపోలేదు, కొబ్బరి చెట్టు, రాజేష్‌లలో ఎవరు మంచివారు? ఎందుకు?

2) కొబ్బరి చెట్టు తాను పొందిన మేలును మరిచిపోకుండా ఏం చేసింది?

3) రాజేష్ రామయ్యను చూడగానే ఏం చేస్తే బాగుండేది? మీరే రాజేష్ స్థానంలో ఉంటే ఏం చేసేవారు?

4) ఈ సంఘటనల నుండి మీరేం నేర్చుకున్నారు?

5) మనం ఏవరెవరికి కృతజ్ఞులుగా ఉండాలి?

6) మన అమ్మ నాన్నలు మనకు ఏమేమి చేస్తున్నారు? మనం వారిపట్ల కృతజ్ఞత ఎలా చూపెట్టాలి?

### తెలుసుకోండి

లోకంలో ఎందరో – ఏమీ చేయకుండానే లేదా 'ఇంత చేసి, 'అంత'గా చెప్పుకుంటారు. కల్పవృక్షంగా ఉపకారం చేస్తున్న కొబ్బరిచెట్టు ఏమి చెప్పుకుంటోంది? ఎవరితో చెప్పుకుంటోంది? పోనీ, మన నుండి ఏమైనా ప్రత్యుపకారాన్ని ఆశిస్తుందా? అదీలేదు కదా! అంతే కాదు చేసినదానితో తృప్తి చెందకుండా ఇంకా చేస్తూనే ఉంది.

కన్న తల్లిదండ్రులను దైవంగా పూజించాలని మనకు వేదాలు చెబుతున్నాయి. వారి సేవలను అనుభవించి వారి బాగోగులు చూడకుండా వారిని 'తల్లిదండ్రులు' అని చెప్పుకోవడానికి సిగ్గుపడే రాజేష్ లాంటి వారిని కృతఘ్నులు అంటారు.

తల్లిదండ్రులే కాదు ఎవరు ఏ కొద్ది సహాయం చేసినా దానినెప్పుడూ మరవరాదు. అది చేసిన వ్యక్తిని కూడా ఎన్నడూ మరవరాదు. వారి విషయంలో కృతజ్ఞత చూపడం మన కనీస కర్తవ్యం.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- పిల్లలను తాము కృతజ్ఞతలు తెలిపిన సందర్భాలను తెలపమని చెప్పి చర్చించాలి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- పిల్లలను వారంపాటు తాము ఏ సహాయం పొందినా ధన్యవాదాలు (థ్యాంక్స్) చెప్పమనాలి. ఏమేం సహాయం పొందారో/ ఎప్పుడెప్పుడు ధన్యవాదాలు తెలిపారో చెప్పమనాలి. చర్చించాలి.

చెట్లు మనకు ఆహారం, ఫలాలు ఇస్తున్నాయి. చెరువులు, నదులు మనకు నీరు ఇస్తున్నాయి. చెట్లు నీడను, చల్లని గాలిని ఇస్తున్నాయి. ఆవులు, గేదెలు కమ్మని పాలు ఇస్తున్నాయి. ఈ భూమి మనకు అన్నివిధాల ఆదుకుంటున్నాయి. మరి ఇన్ని ఇచ్చిన ఈ ప్రకృతికి మనం నిజంగా కృతజ్ఞత చూపిస్తూ భక్తిభావంతో ఉంటున్నామా? ఆలోచించండి.

**సూక్తి**

**మనిషికి ఉండాల్సిన మంచి లక్షణాలలో ఒకటి చేసిన మేలును మరవకపోవడం.**

# 4 చిరునవ్వు

**I. ప్రధాన విలువ** → జీవన నైపుణ్యాలు

**II. ఉప విలువ** → చిరునవ్వుతో పలకరించడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- ఎవరినైనా చిరునవ్వుతో పలకరించాలని తెలుసుకోవడం.
- ఇతరులను చిరునవ్వుతో పలకరించే గుణాన్ని అలవర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ముఖం మీద చిరునవ్వుతో ఉన్న వ్యక్తులను అందరూ ఇష్టపడుతారు. మనుషుల మధ్య సంబంధాలు పెరుగుతాయి. చిటపటలాడే ముఖం ఉంటే ఎవ్వరూ మన దగ్గరికి కూడా రారు. చిరునవ్వుతో పలకరించడం వల్ల ఎదుటి వారికి ఎంతో సంతోషం కలుగుతుంది. వారికి మనపట్ల గౌరవం, స్నేహభావం పెరుగుతుంది. కావున పిల్లల్లో చిరునవ్వుతో పలకరించడం అనే భావనను కలుగజేయడం చాలా ముఖ్యం. ఈ కింది సంఘటనలను గమనించండి.

## V. సంఘటనలు

*సంఘటన - 1*

*అనిల్ ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్నాడు. అనిల్ అంటే వారి తల్లిదండ్రులకు, ఇంటి చుట్టుపక్కల వారికి, స్కూల్లో విద్యార్థులకు, టీచర్లకు అందరికీ ఇష్టం ఎందుకంటే అందరితో చిరునవ్వుతో చక్కగా గౌరవంగా, ఆప్యాయంగా మాట్లాడుతాడు. ఎవరేమడిగినా చక్కగా సమాధానం చెపుతాడు.*

*ఇంటి దగ్గర ఇరుగుపొరుగు వారెవ్వరైనా కనిపిస్తే అంకుల్ బాగున్నారా! అని ఆప్యాయంగా పలుకరిస్తాడు. అందుకని అనిల్‌ను చూడగానే వారి ముఖంలో ఆనందం, ఆప్యాయత ప్రత్యక్షమౌతాయి. ఇంటికి వచ్చిన వారిని కూడా మర్యాదగా పలుకరించి, కూర్చోండి చెబుతాను అని చెప్పి, మంచి నీరు తెచ్చిస్తాడు. పాఠశాలకు వచ్చిన వెంటనే పిల్లల్నందరినీ చిరునవ్వుతో పలుకరిస్తాడు, టీచర్లకు చిరునవ్వుతో నమస్కరిస్తాడు. ఒకరోజు మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పిల్లలందరూ ఆటలు ఆడుకుంటున్నారు. ఆటలు ఆడుకుంటూ ఒక అమ్మాయి కింద పడిపోయింది. అది చూసిన 'అనిల్' వెంటనే ఆ అమ్మాయి దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ అమ్మాయిని లేపి మోకాలు తుడుస్తూ అరే! ఏమి కాలేదులే ఏడవద్దు, ఊరికే గీరుకపోయింది చూడు, రక్తం కూడా రావటంలేదు, త్వరగా తగ్గిపోతుందిలే అని ఊరడించాడు. ఆ అమ్మాయి ఏడుపు ఆపి మళ్ళీ ఆనందంగా ఆటలో మునిగిపోయింది.*

*ఒకరోజు శాంతి టీచర్ కుర్చీలో నీరసంగా కూర్చోని ఉండటం చూశాడు. (ఆ టీచర్ ఎవరితో ఎక్కువగా మాట్లాడదు, సీరియస్‌గా ఉంటుంది. అందుకని పిల్లలెవరూ ఆమె దగ్గరికి స్వేచ్ఛగా వెళ్ళరు) వెంటనే మేడమ్ దగ్గరికి వెళ్ళి మేడం ఎందుకలా ఉన్నారు? ఏమయింది? ఒంట్లో బాగలేదా! అని అడిగాడు. చిన్నపిల్లవాడు అలా అడగడంతో ఆమెకు ఆశ్చర్యంతోపాటు ఆనందం కూడా వేసింది. జ్వరం వచ్చింది నాన్నా! అని చెప్పింది. జ్వరం వచ్చిందా! త్వరగా తగ్గిపోతుందిలేండి మేడం అని చెప్పి వచ్చాడు. మరలా రెండు రోజుల తర్వాత శాంతి టీచర్ దగ్గరకు వెళ్ళి జ్వరం తగ్గిందా అని అడిగాడు.*

*కేవలం ఇంటిదగ్గర, పాఠశాలల్లోనే కాదు, ప్రయాణాలు చేస్తున్నప్పుడు, పెళ్ళిళ్ళలో ఎవరి ఇంటికైనా వెళ్ళినపుడు కూడా ఈ అబ్బాయి మాట తీరు ఇలానే ఉంటుంది. తెలిసినవారిని, తెలియనివారిని కూడా చిరునవ్వుతో పలకరించడం వల్ల చిన్న, పెద్ద అందరూ నిమిషాలలో ఈ అబ్బాయికి స్నేహితులైపోతారు, అభిమానులై పోతారు.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) 'అనిల్' ఎలాంటి వాడు? ఏం చేస్తాడు?
2) మీరు అనిల్ లాగానే ఎవరితోనైనా మాట్లాడతారా? ఎందుకు?
3) మీతో ఎవరు మాట్లాడినపుడు ఆనందంగా అనిపిస్తుంది? ఎందుకు?
4) మీతో కోపంగా, చిరాగ్గా ఎవరైనా మాట్లాడారా? అప్పుడు మీకు ఎలా అనిపించింది?
5) ఎవరితోనైనా చిరునవ్వుతో పలకరిస్తూ మాట్లాడాలి? ఎందుకు?

### తెలుసుకోండి

## ఇతరులను నవ్వుతూ పలకరించడం

మనం ఎవరినైనా నవ్వుతూ పలకరించాలి. మనం ఇంటికి వచ్చిన వారిని చిరునవ్వుతో ఆదరించాలి. అతిథిదేవోభవ! అని మన సంస్కృతిలోనే ఉంది. అతిథి దైవంతో సమానము. మన భారతీయ సంప్రదాయం ప్రకారము ఇతరులకు ఇబ్బంది కల్గించకుండా చిరునవ్వుతో పలకరించడమే. ఇతరులతో నవ్వుతూ మాట్లాడడం వలన వారిలో నున్న బాధను తొలగించవచ్చు. నవ్వు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. నవ్వడం ద్వారా సకలరోగాల నుండి బయట పడవచ్చు. నవ్వుతూ పలకరించడం ద్వారా ఇతరులతో మానవ సంబంధాలు పెంచుకోవచ్చు. మనకు సమాజంలో గౌరవ భావం పెరుగుతుంది. కాబట్టి నవ్వుతూ నవ్వించాలి. నవ్వుతూ పలకరించడమనేది మన కుటుంబం నుండి మొదలు పెట్టాలి. ముఖ్యంగా మన పిల్లలకు ఇతరులను నవ్వుతూ పలకరించడం ద్వారా కలిసిమెలిసి జీవించడం ద్వారా ఎన్నో ప్రయోజన్నాలున్నాయనే భావనను పెంపొందింప జేయాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- ఈ కింది అంశాల గురించి విద్యార్థులతో మాట్లాడించండి.

1) మీ పాఠశాలలో ఎవరు ఎప్పుడు చిరునవ్వుతో ఉంటారు?
2) మీరు ఎవరెవరితో ఆప్యాయంగా మాట్లాడుతారు చెప్పండి.
3) మీరు ఎవరెవరితో ఆప్యాయంగా మాట్లాడరో చెప్పండి.
4 మీతో ఎవరెవరు అప్యాయంగా మాట్లాడుతారు. అప్పుడు మీకెలా అనిపిస్తుంది.
5) మీతో ఎవరెవరు ఆప్యాయంగా మాట్లాడరు. వారు మాట్లాడినప్పుడు మీకు ఎలా అనిపిస్తుంది?
6) మీపట్ల గౌరవభావం, స్నేహభావం పెరగాలంటే ఇతరులతో మీరు ఎలా ఉండాలనుకుంటున్నారు?
7) ఇంట్లో, బయట అందరు నవ్వుతూ ఉంటే బాగుంటుందా లేక సీరియస్‌గా ఉంటే బాగుంటుందా? ఎందుకు?
8) చిరునవ్వుతో సంతోషంగా ఉండేవాళ్ళంటే అందరు ఇష్టపడతారు. ఎందుకు?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీ చుట్టు ప్రక్కల ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారెవరు? కోపంగ ఉండేవారెవరు?
- ఈ వారం రోజులు మీరు అందరినీ నవ్వుతూ పలకరించండి. దానివల్ల మీకు కలిగిన అనుభవాలు చెప్పండి.

**సూక్తి**

**ప్రియముగా చిరునవ్వుతో మాట్లాడితే మీతో మాట్లాడే వారందరికీ తృప్తి కలుగుతుంది. స్నేహం పెరుగుతుంది.**

# 5 నేనూ పనులు చేస్తా

**I. ప్రధాన విలువ** → బాధ్యత నిర్వర్తించడం

**II. ఉప విలువ** → ఇంటి పనిలో సహాయపడడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- ఇంటిపనిలో తమ తల్లిదండ్రులకు సహాయం చేయాలని పిల్లలకు తెలియజేయడం.

## IV. ఉపోద్ఘాతం

మనం ఎన్నో కుటుంబాలను చూస్తూ ఉంటాం. కొన్ని కుటుంబాలలో పనులను అందరూ కలిసి పంచుకొని చేస్తూ ఉంటారు. మరొకొన్ని కుటుంబాలలో అన్ని పనులూ ఒక్కరే చేస్తూ ఉంటారు. మరి ఇంటి పనుల్లో ఎవరెవరు ఏఏ పనుల్లో సహాయపడవచ్చు. పిల్లలు తమకు చేతనైన పనులను చేయడం ద్వారా తల్లిదండ్రులకు ఎలా సహాయం చేయవచ్చో తెలియజేయాలి.

ఇతరులకు సహాయం చేయడాన్ని చిన్నప్పటి నుండే పిల్లలకు అలవర్చినట్లయితే వాళ్ళకు బాధ్యతలను నేర్పించడమే కాకుండా, విలువల్ని, కూడా తెలియజేసిన వాళ్ళమవుతాయి. ఎదుటివారికి సహాయపడటం, పరస్పర సహకారం గురించి నేటి పిల్లలకు ఒక బాధ్యతగా తెలియజెప్పవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మనం ఇంట్లో ప్రతిరోజూ చూస్తూ ఉంటాం. లేచిన దగ్గర నుండి అమ్మ ఎన్నో పనులు చేస్తూఉంటుంది. అలా అమ్మ అన్ని పనులు చేస్తున్నపుడు ఎవరెవరు ఎలాంటి సహాయసహకారాలనందిస్తున్నారు? మీ ఇంట్లో అయితే మీరు ఎటువంటి సహాయం చేస్తారు?

ఉదాహరణకు ఈ కింది సన్నివేశాలు చూద్దాం.

## V. సంఘటనలు

### సంఘటన - 1

రాజు వాళ్ళ ఇంట్లో వాళ్ళ అమ్మ, నాన్న, బామ్మ, తాతయ్య, రాజు, రాణి ఉంటారు. వాళ్ళ ఇంట్లో రాణి వాళ్ళ అమ్మకు వంట పనుల్లో వాళ్ళ బామ్మ సహాయం చేస్తుంది. బయటికి వెళ్ళి సరుకులు, కూరగాయలు తేవడం, బిల్లులు కట్టిరావడం బయట అవసరమైన వస్తువులు కొని తేవడం మొదలైన పనులు రాజు వాళ్ళ నాన్న, తాతయ్య చేస్తుంటారు. దగ్గరి దుకాణంలో నుండి చిన్న చిన్న వస్తువులు రాజు, రాణి కొని తెస్తుంటారు. అలానే భోజనాలు చేసేటపుడు మంచినీళ్ళు పెట్టడం, గ్లాసులు, పళ్ళాలు సర్దటం భోజనం చేసిన తరువాత ఎవరి ప్లేట్లు వారే కడగడాలి వంటి పనులు కూడా చేస్తూ రాజు, రాణి వాళ్ళమ్మకు సహాయంగా ఉంటారు. పిల్లలిద్దరూ కూడా వారికి సంబంధించిన పనులను వారే చేసుకుంటూ ఉంటారు. ఈ విధంగా రాజు వాళ్ళ ఇంట్లో అందరూ కలసి పనులు చేసుకుంటూ ఉంటారు. ఎవరి పనులు వారు చేసుకుంటే ఏమీ కష్టం అనిపించదు.

### సంఘటన - 2

రవి వాళ్ళ ఇంట్లో కూడా రాజు వాళ్ళ ఇంట్లో లాగానే రవివాళ్ల అమ్మా, నాన్న, బామ్మ, తాతయ్య, రవి, చెల్లి కలిసి ఉంటారు. అయితే రవి వాళ్ళ ఇంట్లో పనులను ఎవరూ కలిసి చేయరు. రవి వాళ్ళ బామ్మ, తాతయ్యలు టి.వి చూస్తూ కాలం గడుపుతారు. రవి వాళ్ళ అమ్మకు ఎటువంటి సహాయం చేయరు. రవివాళ్ళ నాన్న కూడా ఎప్పుడూ తన ఆఫీసు పనితో బిజీగా ఉంటాడు. రవి, వాళ్ళ చెల్లికూడా వాళ్లమ్మకు పనుల్లో సహాయం చేయకపోగా, వాళ్ళ పుస్తకాలను, దుస్తులను ఎక్కడివక్కడే పడేస్తూ ఉంటారు. రవి వాళ్ళ అమ్మకు ఇంటి పనులే కాక వీళ్ళందరి పనులు చేసిపెట్టడంతో ఒక్కక్షణం తీరిక లేకుండా సాయంకాలం వరకు పనిచేసి చేసి అలసిపోయి ఎక్కువగా అనారోగ్యానికి గురవుతూ ఉంటుంది. అది చూసి ఇంట్లో బాధపడుతూ ఉంటారు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పై రెండు సన్నివేశాలలో మీరు గమనించిన తేడా ఏమిటి?

2) ఏ కుంటుంబంలోని వారు బాధ్యతతో మెలుగుతున్నారు? ఎందుకు?

3) మీ కుటుంబంలోని వారు ఒకరికొకరు సహాయం చేసుకుంటారా? ఏ పనులు ఎవరు చేస్తారు?

4) మీ ఇంట్లో నీవు చేసే పనులేవి?

5) నీవు ఎప్పుడైనా ఎవరికైనా సహాయంచేశావా? ఏసందర్భంలో?

### తెలుసుకోండి

మానవుడు సంఘజీవి. సమాజంలో మనిషి జీవించాలి అంటే ఒకరి సహకారం మరొకరికి అవసరం. అలానే మన ఇంటిలో వృద్ధులు ఉంటుంటారు. వారిలో కొందరు నడవలేని స్థితిలో ఉంటారు. అటువంటి వారికి చేయి అందించి నడిపించడం, విసుక్కోకుండా వారు చెప్పింది వినడం ద్వారా వారికి సహాయం చేసిన వారమే కాకుండా వారికి ఆనందాన్ని కల్గించిన వాళ్ళం కూడా అవుతాం. అల్లే బయట రోడ్డుమీద కొందరు గుడ్డివాళ్ళు రోడ్డు దాటలేక అవస్థపడుతూ ఉంటారు. వారికి మనవంతు సహాయంగా వారిని రోడ్డు దాటించడం వంటి పనులను చేయవచ్చు. దీనివల్ల మనకూ ఎంతో కొంత తృప్తి కూడా లభిస్తుంది.

*ఈ విధంగా ఎవరికివారు ఎదుటివారికి తాము చేయగల్గిన సహాయాన్ని అందించాలి.* ఈ సహకార భావం అనేది విద్యార్థులకు వారి కుటుంబాల నుంచే మొట్టమొదటగా అలవడుతుంది. కుటుంబంలో అమ్మ, నాన్న, అవ్వ, తాత పిల్లలు చాలా మంది ఉంటారు. వీరు కుటుంబంలో తమ పనులు తాము చేసుకుంటూ ఒకరికొకరు సహకరించుకుంటూ ఒకరి ఆనందంలో, దుఃఖంలో మరొకరు పాలు పంచుకుంటూ ఉంటారు. ఇదే కుటుంబం యొక్క గొప్పదనము. పిల్లలు కూడా చిన్నప్పటి నుంచే ఇంటిలోని వ్యక్తులకు సహాయపడుతూ, తమపనులు తాము చేసుకోవాలన్న విషయాన్ని పిల్లలచే గ్రహింపజేయాలి. అలా పిల్లలు అలవాటు పడినప్పుడే సమాజానికి ఉపయోగపడే, అందరికీ సహాయసహకారం అందించే పౌరులు తయారవుతారు. ఇలా పిల్లల్ని తయారుచేయడం తల్లి దండ్రుల ఉపాధ్యాయుల బాధ్యత.

*ఇటువంటి సన్నివేశాలను మనం నిత్యజీవితంలో చూస్తూనే ఉంటాం. కాబట్టి ఇంటిపనుల్లో ఏ ఒక్కరో కాకుండా అందరూ సమానంగా ఎవరు చేయగల్గిన పనులు వారు చేసినట్లయితే ఎవరికీ ఎక్కువగా శ్రమ అనిపించదు.*

## ఆ) తరగది కృత్యం - జట్టుపని

♦ విద్యార్థులు తమ ఇంటిలోని వారికి ఎటువంటి సహాయం చేయగలరో ఈ కింది పట్టిక సహాయంతో జట్లలో చర్చింపజేసి చెప్పమనాలి.

| క్ర.సం. | కుటుంబంలోని వ్యక్తి | పిల్లలు చేయగలిగిన సహాయం |
|---|---|---|
| 1. | తల్లికి | |
| 2. | తండ్రికి | |
| 3. | బామ్మకి | |
| 4. | తాతయ్యకి | |
| 5. | చెల్లికి / అక్కకి | |
| 6. | తమ్మునికి / అన్నకి | |

♦ మీరు కింది వాటిలో ఏఏ పనులలో సహాయపడుతున్నారో చేస్తే ఆ ఔను అని లేకపోతే కాదు అని నిజాయితీగా చెప్పండి. ఔను / కాదు

1) అమ్మకు వంట పనులలో సహాయం చేస్తాము.

2) తిన్న కంచం కడుగుతాను.

3) బట్టలు ఉతకడంలో సహాయపడతాను.

4) ఇల్లు శుభ్రం చేయడంలో సహాయపడతాను.

5) సరుకులు తేవడంలో సహాయంచేస్తాను.

6) నానమ్మ, తాతయ్య చెప్పిన పనులు చేస్తాము.

7) రాత్రి పడుకునేటప్పుడు పక్కలు వేయడం, తెల్లారాక పక్కలు తీసేయడం చేస్తాను.

8) చెట్లు పెంచుతాను. రోజూ నీళ్ళుపోస్తాను.

9) ఇంట్లో సామాన్లు ఎక్కడివి అక్కడ పెడతాను సర్దుతాను.

10) నా పనులన్నీ నేనే చూసుకుంటాను.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- ఈ వారం రోజులు మీరు మీ ఇంటిలోని వారికి చిన్న చిన్న పనులలో సహాయం చేయండి. ఎవరికి ఏ సహాయం చేశారో తెలపండి? మీకు (అనుభూతులను) ఎలా అనిపించిందో తెలపండి. ఈ విధంగా అందరికీ సహాయం చేయడం కొనసాగించండి.

### సుపుత్రుడు

మణిపురం అనే గ్రామంలో కనకమ్మ అనే రజకస్త్రీ నివసించేది. ఆమెకు భూషణం అనే కొడుకున్నాడు. ఆమె పేరు కనకం అయినా ఒక్క బంగారు ఉంగరం తప్ప మరే సంపద లేదు. భూషణం మూడేళ్ళ వయసులోనే తండ్రి చనిపోయాడు. కనకమ్మ గుణవంతురాలు. పిల్లాడిని చక్కగా పెంచింది. ఆమె చేతికున్న ఉంగరం ఒకనాడు బట్టలుతుకుతుంటే చెరువులో పడి కనిపించలేదు. బాధపడింది. ఆ విషయం భూషణానికి తెల్పింది. బాధపడకమ్మా! బడి నుండి వచ్చిన తరువాత వలతీసుకెళ్ళి చెరువులో చేపలు పట్టి వాటిని అమ్మి ఆ డబ్బుతో నీకు ఉంగరం చేయిస్తా' అన్నాడు. కొడుకు అభిమానానికి మురిసిపోయింది. ముందు చదువుకొని గొప్పవాడివి కా నాయన! అంది.

భూషణం తల్లి మాట ప్రకారం బాగా చదువు చదువుకుంటూ ఖాళీసమయంలో చేపలు పట్టి అమ్మి ఆ డబ్బును కూడబెట్టేవాడు. ఒకనాడు చాలా చేపలు పట్టాడు. అన్నిటినీ అమ్మాడు. ఒక చేపను ఇంటికి తెచ్చాడు. అమ్మా డబ్బీ నిండింది ఆ డబ్బుతో పట్నంలో ఉంగరం కొంటాను నీకు. ఈ నాడు ఈ చేపను వండుకుందాం అన్నాడు భూషణం. తల్లి సరేనని ఆ చేపను కత్తిపీటతో కోసింది. అందులోంచి ఠంగున శబ్దం వచ్చింది. చూస్తే ఉంగరం. అది ఆమె పోగొట్టుకున్న ఉంగరమే. "భూషణా! నా బంగారు తండ్రీ! చదువుకుంటూ డబ్బు సంపాదిస్తున్నావు. నువ్వు సుగుణాల రాశివి ఇంతటి సుపుత్రుని కన్న నా జన్మ ధన్యమైంది నాయనా!" అంటూ ఆశీర్వదించింది. తల్లిదండ్రుల కష్టం తీర్చగల ఇలాంటి కొడుకు ఒక్కడుంటే చాలు. ఆ తల్లి దండ్రులు నోములు ఫలించినట్టే.

**సూక్తి**

**మనం చేసే చిన్ని చిన్ని పనులైనా అది మనకు, ఇతరులకు కూడా ఆనందాన్ని కలిగిస్తాయి.**

# 6 నీటి విలువ

**I. ప్రధాన విలువ** → పొదుపు

**II. ఉప విలువ** → నీటిని పొదుపుగా వాడడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →
- నీటిని పొదుపుగా వాడడం తెలుసుకుంటారు.
- నీటివృథాను అరికట్టే చర్యలు చేపడతారు.

## IV. ఉపోద్ఘాతం

మనం ప్రతి వస్తువును ఎలా ఉపయోగించుకోవాలి? ఏ మేరకు ఉపయోగించుకోవాలి అనే విషయం పట్ల అవగాహన కలిగి ఉండాలి. ఏ వస్తువును అనవసరంగా ఉపయోగించకూడదు. వృథాచేయకూడదు. ఏదైనా వస్తువును వృథా చేస్తున్నామంటే ఎవరికి అవసరానికి రాకుండా చేస్తున్నామని అర్థం. మనకు మనమే కాకుండా ఇతరులకు/దేశానికి నష్టం చేస్తున్నట్లే అని భావించాలి. వృథా అనేది రకరకాల రూపాల్లో ఉంటుందని గుర్తించాలి.

నీరు ప్రతిజీవరాశికి ప్రాణాధారం. నీళ్ళు లేకపోతే జీవరాశి ఉనికే లేదు. అటువంటి నీరు మనకు ప్రకృతిలో సహజవనరుగా లభిస్తుంది. ఒక్కరోజు నీళ్ళు లేకపోతే మనిషి బతుకు ఎంత కష్టమౌతుందో ఊహిస్తేనే భయంవేస్తుంది. మనుషుల జనాభా పెరిగే కొద్దీ నీటివాడకం ఎక్కువౌతున్నది. కాని మన అవసరాలకు తగినట్లుగా జలవనరులు పెరగడం లేదు కాబట్టి ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. నీటిని పొదుపుగా వాడితేనే మనమొక్కరమే కాకుండా తరతరాలవారికి నీరు వాడుకోవడానికి ఉంటుంది. లేకపోతే నీటికోసం ముందు ముందు కటకటలాడే పరిస్థితి ఏర్పడుతుంది.

## V. సంఘటనలు

### సంఘటన – 1

అది రామాపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనానికి తరగతి గదుల్లోనుంచి బయటకు వచ్చారు. భోజనానికి ముందు చేతులు, ప్లేట్లు కడుక్కుంటున్నారు. కొంతమంది చేతులు కడుక్కోవడానికి కొంచెం నీళ్ళు మాత్రమే వాడితే మరికొంత మంది విద్యార్థులు మగ్గు నీళ్ళు గుమ్మరిస్తున్నారు. భోజనాలయ్యాయి తరువాత కూడ చేతులు, ప్లేట్లు కడుక్కోవడానికి కొంతమంది పిల్లలు ఎక్కువగా నీటిని ఉపయోగిస్తున్నారు. అంతలో పొరపాటుగా ఒక అబ్బాయి చేయి కడుక్కునేటప్పుడు ఆ నీరు మరొక పిల్లవాడిపై పడింది. రేయ్! నామీద నీళ్ళు పోస్తావా అంటూ చేతిలోని మగ్గులోని నీరు ఆ పిల్లవాడిపై పోశాడు. అదే ఆటగా మారి పిల్లలందరూ ఒకరిపై ఒకరు నీళ్ళు చిల్లుకోవడం మొదలుపెట్టారు చూస్తుండగానే అక్కడ తొట్టిలో పిల్లలకోసం ఉంచిన నీళ్ళన్నీ, ఖర్చయిపోయాయి. తరువాత వచ్చిన పిల్లలకు ప్లేటుకాదుకదా ! చేతులు కడుక్కోవడానికి కూడా నీళ్ళు లేకుండా పోయాయి.

### సంఘటన – 2

మురళి సింక్‌లో పళ్ళు తోముకుంటున్నాడు. కుళాయి తిప్పి పెట్టి నోట్లో బ్రష్‌పెట్టుకొని అద్దంలో చూసుకుంటూ బ్రష్ చేసుకుంటున్నాడు. మురళి బ్రష్‌చేసినంతసేపూ నీళ్ళు అలాపోతూనే ఉన్నాయి. ఇలా మురళి 10 ని॥ల పాటు పళ్ళు తోమాడు.

### సంఘటన – 3

రాణి వాళ్ళ అమ్మ వంట పాత్రలన్నీ సింక్‌లో వేసింది. ముందు కుళాయి తిప్పి తోమడం మొదలుపెట్టింది. ఒక పాత్ర తీయడం కడగడం, ఇంకొక పాత్ర తీయడం కడగడం ఇలా ఒక్కోపాత్ర తోమి కడిగేంత వరకూ ఆ కుళాయిలో నీళ్ళు పోతూనే ఉన్నాయి. ఇలా ఇరవై నిమిషాల పాటు మొత్తం పాత్రలు కడిగింది.

### సంఘటన – 4

ఆ వీధిలో పంచాయితీ వాళ్ళ మంచినీళ్ళ కుళాయి ఏర్పాటు చేశారు. వీధిలోని వారందరికీ ఆ కుళాయే ఆధారం. అందరూ నీళ్ళు పట్టుకొని వెళ్తారు. ఆ కుళాయి బంద్ చేసినా. నీళ్ళు కారుతూనే ఉంటుంది. దాన్ని బాగు చేయించాలని ఎవరూ అనుకోరు. అలా రోజంతా నీళ్ళు కారుతూనే ఉంటుంది. ఆ కుళాయి చుట్టుపక్కలంతా బురద బురదగా మారింది. మరొక వీధిలో నీటిపైపుకు నల్లా లేదు. నీరు రాగానే, ఎవరైన అక్కడ ఉండి పట్టుకుంటె సరిపోతుంది. లేకుంటే నీరు వదరలాగా అలా వీధిగుండా పోతుంది. అందరూ చూస్తూ ఉంటారు, కానీ ఎవరూ పట్టించుకోరు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) నీరు ఏఏ అవసరాలకు కావాలి? నీరు లేకుంటే - ఊహించండి.

2) పై సన్నివేశం వల్ల మీకు ఏమి అర్థం అయ్యింది?

3) మనకు నీరు ఎందుకు అవసరం?

4) నీటిని వృథా చేయడం వల్ల ఏమి జరుగుతుంది?

5) నీరు లేకపోతే మన పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించి చెప్పండి.

6) నీరు వృద్ధి చేసే సందర్భాలు మీకు తెలిసినవి చెప్పండి.

### తెలుసుకోండి

జీవులన్నింటికి నీరే ప్రాణాధారం. మనకు నీరు ప్రకృతిలో సహజంగా లభిస్తుంది. నీరు ఉచితంగా లభిస్తోంది కదా! అని నీటిని వృథాచేయటం వల్ల ఇప్పటికే చాలాచోట్ల నీటిని కొనాల్సిన పరిస్థితులు వచ్చాయి. నీటికి ఆధారం వర్షాలు. వర్షాల వల్లే చెరువుల్లోకి, నదుల్లోకి నీరు చేరుతుంది. భూగర్భజల మట్టం కూడ పెరగుతుంది. వర్షాలు పడాలి అంటే చెట్లు పెంచాలి. అలానే వర్షపు నీటిని కూడా సంరక్షించుకోవాలి, చెక్‌డ్యాంలు కట్టడం, ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయడం వంటి వాటి ద్వారా ప్రభుత్వం వాననీటి సంరక్షణకు చర్యలు చేపట్టుతోంది. నీటిని వృథాగా వాడటం వల్ల మరికొంత కాలానికి నీటిలభ్యత తక్కువైపోతుంది. కనుక మనం ఇప్పటి నుంచి నీటిని పొదుపుగా వాడి మన నీటివనరులను సంరక్షించుకుందాం.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- విద్యార్థులను జట్లుగా చేసి మనం ఏఏ సందర్భాలలో నీటిని వృథాచేస్తామో చర్చించి చెప్పండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మనం ఏఏ సందర్భాలలో నీటిని వృథాచేస్తామో చర్చించారు కదా! ఇలా వృథాకాకుండా మీరు నీటిని అవసరం మేరకే వాడి మీరు ఎలా నీటిని పొదుపు చేశారో తరువాత పీరియడ్‌లో చెప్పండి.

## ఇలా చేయండి.

1) కుళాయి వద్ద పండ్లు తోముకునేప్పుడు, నోటిని శుభ్రపరచుకునేటప్పుడు అవసరమైన నీటిని వాడుకుని కుళాయిని వెంటనే కట్టివేయండి.

2) స్నానం చేసేటప్పుడు స్నానానికి సరిపడా నీరువాడండి. బకెట్లు బకెట్లు కుమ్మరించకండి.

3) స్నానం చేసిన నీటిని మొక్కలకు మళ్ళించండి.

4) మంచినీళ్ళ కుళాయి నుండి కిందపోయే నీటిని కూడా మొక్కలకు మళ్ళించండి.

5) కుళాయి కారుతుంటే వెంటనే బాగు చేయించండి. పెద్దల దృష్టికి తీసుకెళ్ళండి.

**సూక్తి**

**జీవకోటికి నీరే ప్రాణాధారం. మనం పొదుపు చేసే ప్రతి నీటిచుక్కా ఎంతో మంది దాహాన్ని తీరుస్తుందని మరువకూడదు.**

# 7 వ్యక్తిగత పరిశుభ్రత

**I. ప్రధాన విలువ** → ఆరోగ్యవిలువలు

**II. ఉప విలువ** → వ్యక్తిగత పరిశుభ్రత – స్నానం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- పిల్లలు తమ శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంపై అవగాహన కల్పించడం.

## IV. ఉపోద్ఘాతం

వాతావరణంలో ఉండే దుమ్ము, ధూళికణాలు మన శరీరంపైన చేరతాయి. చెమటపట్టి శరీరం మట్టికొట్టుకుపోతుంది. అలాగే బట్టలు కూడా మాసిపోతాయి. శుభ్రంగా స్నానం చేసి, ఉతికిన బట్టలు వేసుకోకపోతే గజ్జి, తామర, వంటి చర్మవ్యాధులు, జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య లక్షణాలు కలుగుతాయి. సూక్ష్మక్రిములు శరీరంలోకి ప్రవేశించి అనేక రోగాలను కలగచేస్తాయి. ఆ రోగాల నుండి కాపాడుకోవడానికి వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరం.

## V. సంఘటనలు

*సంఘటన - 1*

అప్పుడే బడి గంట మోగింది. అందరూ బడికి వస్తున్నారు. ఒక అబ్బాయి చింపిరి జుట్టుతో, శరీరమంతా దుమ్ముకొట్టుకుపోయి, చీమిడి కారుతుండగా, రోడ్డుపై అమ్ముతున్న తినుబండారం కొనుక్కొని ఈగలు ముసురుతూ ఉంటే ఆ పదార్థాన్ని తినుకుంటూ బడికి వచ్చాడు. టీచరు ఆ పిల్లవాడిని చూసి స్నానం చేసావా? అని అడిగింది. అతడు లేదని చెప్పాడు. అప్పుడు టీచరు పిల్లలందరితో చూడండి తరగతి గది, బడి శుభ్రంగా ఉంటే సరిపోదు. మనం కూడా శుభ్రంగా ఉండాలి. లేకపోతే అనేక వ్యాధులకు గురవుతాము. ఆ వ్యాధులు ఆ విద్యార్థి నుండి ఇతర విద్యార్థులకు సోకవచ్చు. కాబట్టి ప్రతిరోజూ సబ్బుతో స్నానం చేసి, ఉతికిన బట్టలను వేసుకోవాలి. అలాగే శరీరంలోని ప్రతి భాగాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. జుట్టు చక్కగా దువ్వుకోవాలి. గోళ్ళను పొడవుగా లేకుండా కత్తిరించుకోవాలి. ఎందుకంటే గోళ్ళలో మట్టి చేరి సూక్ష్మజీవులు వాటిద్వారా శరీరంలోకి ప్రవేశిస్తాయి. అందుకే గోళ్ళను కత్తిరించాలి. కళ్ళను సున్నితంగా శుభ్రంగా కడగాలి. ముఖంపై ఈగలు వాలకుండా చూసుకోవాలి. ముక్కు చీమిడి కారకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. చెవిని శుభ్రంగా స్నానం చేసేటప్పుడు కడగాలి. అలాగని చెవిలో ధారగా నీళ్ళుపోస్తే ఫంగస్ ఏర్పడుతుంది. అలాగే చెవి వెనుక భాగాన్ని కూడా కడుక్కోవడం వల్ల దురద పోగొట్టుకోవచ్చు. అలాగే మరుగు దొడ్డికి వెళ్ళేటప్పుడు చెప్పులు ధరించాలి. ఆ తరువాత సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. దానివల్ల కొంకి పురుగులు శరీరంలోకి ప్రవేశించవు. ఇప్పుడు చూడండి ఈ అబ్బాయి ఇలా ఉండటం మూలానా ఎంత నష్టమో మీ అందరికీ తెలిసింది కదా! అని టీచరు అనగానే ఆ అబ్బాయి టీచర్ నేనిప్పుడే ఇంటికి వెళ్ళి స్నానం చేసి ఉతికిన బట్టలు కట్టుక్కొని వస్తానని చెప్పి, శుభ్రంగా తయారయి వచ్చాడు. టీచరు ఎంతో మెచ్చుకుంది. తోటి విద్యార్థులు చప్పట్లతో అతనిని అభినందించారు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మీలో ఎందరు ప్రతిరోజు స్నానం చేస్తారు? చేయలేకపోవడానికి కారణాలు ఏంటి?

2) స్నానం చేస్తే లేక చేయకపోతే మీకేమనిపిస్తుంది?

3) శరీరాన్ని ఎందుకు పరిశుభ్రంగా ఉంచుకోవాలి?

4) మన శరీరం పరిశుభ్రంగా లేకపోతే ఇతరులకు జరిగేహాని ఏమిటి?

5) వ్యక్తిగత పరిశుభ్రత వలన అంటురోగాల్ని అరికట్టవచ్చా?

6) కొద్ది మంది పిల్లలు అపరిశుభ్రంగా ఎందుకుంటున్నారు?

7) శుభ్రంగా ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో చెప్పండి?

**తెలుసుకోండి**

ఆరోగ్యంగా ఉండటానికి వ్యక్తిగత శుభ్రతను పాటించడం చాలా అవసరం. వ్యక్తిగత శుభ్రత లేకపోతే అంటువ్యాధులు సోకుతాయి. నూటికి 80% జబ్బులు వ్యక్తిగత శుభ్రత లేకపోవడం వల్లనే వస్తాయి. కళ్ళు, ముక్కు, చెవి, నోరు, గోళ్ళు, జుట్టు, చేతులు, కాళ్ళు, పాదాలు, పళ్ళు మొదలైనవన్నీ కూడా శుభ్రంగా ఉంచుకోవాలి. చాలామంది పిల్లలు వీటి విషయంలో శుభ్రతను పాటించకపోవడం వల్లనే అనేక రోగాలపాలవుతున్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ఆరోగ్యమే మహాభాగ్యం.

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- విద్యార్థులను జట్లుగా ఏర్పరచి, స్నానం చేసేటపుడు ఈ క్రింద పేర్కొన్నవి చేస్తున్నారో లేదో చెప్పమని అడగాలి.

1) స్నానం నేనే సొంతంగా చేస్తాను. ప్రతిరోజూ చేస్తాను.
2) స్నానం చేసేటపుడు శరీరంలో అన్ని భాగాలు తడిసేలాగా నీళ్ళుపోసుకుంటాను.
3) సబ్బుతో రుద్దుకునేటపుడు అన్ని శరీరభాగాలు శుభ్రంగా రుద్దుతాను.
4) సబ్బుపోయేలా నీళ్ళతో కడుక్కుంటాను.
5) గబగబా స్నానం చేస్తాను.
6) స్నానం చేసేటపుడే కాళ్ళు, చెవులు, ముక్కు శుభ్రం చేసుకుంటాను.
7) స్నానం చేశాక పొడి తువ్వాలుతో శుభ్రంగా తుడుచుకుంటాను.
8) ఉతికిన బట్టలే ఆరినవి తొడుక్కుంటాను.
9) కొంచెం తడిగా ఉన్న బట్టలు, డ్రాయర్లు వేసుకుంటాను.
10) బయటికి వెళ్ళి వచ్చినపుడల్లా కాళ్ళు, చేతులు శుభ్రంగా కడుక్కుంటాను.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- రోజూ శుభ్రంగా స్నానం చేసి, తల చక్కగా దువ్వుకొని ఉతికిన బట్టలు ధరించండి. వారం రోజుల తరువాత మీకు ఎలా ఉందో, మిమ్మల్ని చూడగానే ఇతరపిల్లలు, టీచర్లు పెద్దలు ఏమనుకున్నారో చెప్పండి.

**సూక్తి**

**శరీరశుభ్రత పాటించడం, ఉదయాన్నే స్నానం చేయడం, శుభ్రమైన దుస్తులు ధరించడం మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయి.**

# 8 పెద్దలను గౌరవిస్తాం

| | |
|---|---|
| I. ప్రధాన విలువ | సంస్కృతి-సంప్రదాయాలు |
| II. ఉప విలువ | పెద్దలను గౌరవించడం |
| III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు | ♦ పెద్దలపట్ల ప్రేమ, ఆప్యాయలతో మెలగడం, పెద్దలపట్ల గౌరవ మర్యాదలతో నడుచుకుంటూ వారిపట్ల సానుభూతితో వ్యవహరించడం. |

## IV. ఉపోద్ఘాతం

*గౌరవించడం అనేది ఇంటివద్ద నుండే ప్రారంభమవుతుంది. వయసుతో నిమిత్తం లేకుండా మనం ఎవరినైనా గౌరవించినపుడు ఆ గౌరవాన్ని మనం సులభంగా తిరిగి పొందవచ్చు. పెద్దలపట్ల గౌరవంగా ఉండడమంటే నమస్కారం చెయ్యడం మాత్రమేకాదు, పెద్దలను గౌరవిస్తూ వారు చెప్పేది వినడం, చిన్నచిన్న అవసరాలను తృణీకరించకుండా చేయడం, ఎదుటివారి మనసు బాధపడేలా మాట్లాడకుండ ఉండడం, ప్రేమ ఆప్యాయతలతో మెలగడం అని మనం గుర్తుంచుకోవాలి.*

*పిల్లలూ! మీలాగే 3వతరగతి చదువుతున్న అరుణ తన కుటుంబంలోనివారితో ఎలా మెలగుతుందో వినండి.*

## V. విషయ వివరణ

*అరుణ తన స్నేహితురాలు లలితను వాళ్ళ ఇంటికి, తాతయ్య, నాయనమ్మలను కలవడానికి తీసుకొని వెళ్ళింది. అరుణవాళ్ళ నాయనమ్మ తలుపు తీసి వారిని కౌగలించుకొని చిరునవ్వుతో వాళ్ళకి స్వాగతం చెప్పింది. ఆమె వాళ్ళకి మంచి సమోసాలు పెట్టింది. పిల్లలు ఆమెకు సంతోషంతో కృతజ్ఞతలు చెప్పారు. అరుణ తాతయ్య గారితో కలిసి బజారుకువెళ్ళింది. తాతగారికి దారిలో ఏ ఇబ్బంది కలుగకుండ అరుణ చూసుకొంది. గతుకులున్న చోట ఆయన చెయ్యి పట్టుకొని ఆయనతోపాటు మెల్లగా నడిచింది. ఆయన తిరిగి ఇంటికి బయలుదేరేటప్పుడు ఆయన చేతిలోని సంచి తాను తీసుకొని ఆయనకు చేతి కర్ర అందించింది. అరుణ తాతయ్య, నాయనమ్మల అవసరాలు చూసి వారు తృప్తి పడ్డాక లలితతో పార్కుకు వెళ్ళింది.*

*"మీతాతగారిని, నాయనమ్మలను జాగ్రత్తగా చూసుకోవడం నీకు విసుగుకలిగించడం లేదా?" అని లలిత అరుణని అడిగింది. "ఏంతమాత్రంలేదు. వాళ్ళతో గడపడమంటే నాకిష్టం" అని అరుణ సమాధానమిచ్చింది.*

*మానాయనమ్మ చాలా రుచికరమైన పదార్థాలు తయారుచేస్తుంది. నేను ఇంటికి వచ్చేసరికి ఆమె ఎప్పుడూ నాకోసం ఎదురు చూస్తూ ఉంటుంది. అంతేకాదు నా ఆటబొమ్మలకు దుస్తులు కుట్టడంలో మానాయనమ్మ సహాయం చేస్తుంది. మా తాతయ్యగారు నేను స్కూలు పాఠాలు చదువుకోవడంలో సహాయం చేస్తారు. మంచి మంచికథలు చెప్తారు. నాకే అవసరం వచ్చినా మంచి సలహాలిస్తూ సహకరిస్తారు. వాళ్ళు జీవితంలో చాలా అనుభవం ఉన్నవాళ్ళు. ఒక్కోసారి వారు చెప్పినమాటే చెప్పడం, చేసినపనే చెయ్యడం చేస్తుంటారు. అయినా నేను వాళ్ళను విసుక్కోను. వాళ్ళు ఒక విషయం చెప్పి మన మంచికోసమే మరల మరల చెప్తుంటారని మానాన్న గారు చెప్తుంటారు. ఏదిఏమైనా మా ఇంట్లో వాళ్ళున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది" అని అరుణ వారి పట్లగల ప్రేమ, ఆప్యాయతలను, గౌరవభావాన్ని తెలియజేసింది. లలిత కూడా వాళ్ళ నాయనమ్మ, తాతయ్యల గురించి ఎన్నో కబుర్లు చెప్పింది. కానీ అప్పుడప్పుడు తాను వారిపట్ల గౌరవంగా ప్రవర్తించని సంఘటనలు గుర్తుకుతెచ్చుకొంది. ఇంకెప్పుడూ అలా ప్రవర్తించనని తన మనసులోనే తాను నిర్ణయించుకుంది.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) పెద్దలను గౌరవించడం అంటే మీకేమి అర్థమైందో చెప్పండి.

2) ఈసంఘటనలో అరుణ తన తాతయ్య, నాయనమ్మలతో ఎంతో గౌరవ మర్యాదలతో ప్రవర్తించికదా! ఇలా మీరెప్పుడైనా ఇంట్లోగానీ, బైటివ్యక్తులపట్ల గౌరవంతో ప్రవర్తించిన సంఘటనలు చెప్పండి.

3) మీరు విన్న సంఘటనలో లలిత అప్పుడప్పుడు తన పెద్దల పట్ల గౌరవంగా ప్రవర్తించలేదని గుర్తుకు తెచ్చుకుంది కదా! అలానే మీరెప్పుడైనా గౌరవంతో ప్రవర్తించని సంఘటనలు చెప్పండి. అలా చేయడం మంచిదేనా? ఎందుకు?

### తెలుసుకోండి

పిల్లలూ! అరుణ వాళ్ళ కుటుంబంలోని వారితో మెలిగిన విధానం విన్నారుకదా! అంటే పిల్లలందరూ పెద్దలపట్ల ప్రేమ, ఆప్యాయతలను కలిగి ఉండాలి. పెద్దలను గౌరవిస్తూ వారుచెప్పేది వినడం, చిన్నచిన్న అవసరాలను విసుక్కోకుండా చేయడం, ఎదుటివారి మనసుబాధపడేలా మాట్లాడకుండా గౌరవ మర్యాదలతో నడచుకోవాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) పిల్లలూ! ఇద్దరిద్దరు జతగా ఏర్పడండి. ఈకింది సంఘటనలలోని రెండుపాత్రలను ఇద్దరూ చెరొకపాత్రను అభినయించండి. పాత్రను అభినయించిన తర్వాత పిల్లవాడి పాత్రధారికి ఎలా అనిపించిందో అడగండి.

- పిల్లవాడు ఒకముసలి అవ్వను తోసుకుని ముందుకుపోవడం.
- తల్లి ఇతరులతో మాట్లాడుతున్నపుడు పిల్లవాడు అడ్డుతగులుతున్నాడు.
- తన తండ్రి వెనక్కి రమ్మని పిలిచినా కూడా, సంచి విసిరేసి పిల్లవాడు తండ్రిపై అరుస్తూ పరిగెత్తుతున్నాడు.
- పెద్దలు కలిసినప్పుడు, ఉపాధ్యాయులు కలిసినప్పుడు రెండు చేతులు జోడించి నమస్కారం చెప్తాడు.

2) వీటిలో ఏవేవి తప్పు అని మీరు భావిస్తున్నారు? అది తప్పైతే దానికి బదులు మీరేమి చేస్తారో చెప్పండి.

- మీతాతయ్య మిమ్మల్ని ఒకపని చెయ్యమని చెప్తున్నారు. నువ్వు బయటకు వెళ్ళి ఆడుకోవాలనే తొందరలో వినిపించుకోకుండా వెళ్ళిపోయావు.
- మీరు మీస్నేహితులతో ఆటలాడుకునేప్పుడు మీటీచరు అటువైపుగా వెళ్తున్నారు. మీరు ఆవిడను చూడనట్టుగా నటిస్తూ ముఖం తిప్పేసుకున్నారు.
- నీస్నేహితుడు తనకు క్రికెట్ ఆట అస్సలు అర్థం కాదని చెప్పాడు. అతడ్ని తెలివిలేని మూర్ఖుడు అని అందరిముందు ఎగతాళి చేశావు.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

■ పిల్లలూ! ఈకింద చెప్పినవిధంగా మీరు చేస్తుంటే మీరు సభ్యతతో ఉంటున్నట్లా? ఇది మంచిపద్ధతేనా? ఎందుకు? ఎలా సభ్యతతో ఉన్నట్లో చెప్పండి.

- మీరు వరుసలో నిలబడినప్పుడు ఇతరులను తోయడం,
- టీచరు చెబుతున్నప్పుడు వినకుండా పక్కవాళ్ళతో మాట్లాడడం
- అడగకుండా ఇతరుల పెన్సిలు తీసుకోవడం,
- పెద్దవాళ్ళని తక్కువ చేసి మాట్లాడడం
- అమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా బయటికి వెళ్ళడం.

మీతాతగారు, మీనాయనమ్మ మీతోనే ఉంటారా? ఉంటేమీరు వారితో మర్యాదగా, సత్ప్రవర్తనతో మెలుగుతున్నారా? ఏఏ సందర్భాలలో మీరు ఎలా వారితో ప్రవర్తించారో తరగతిలోని పిల్లలకు చెప్పండి. మీరు సత్ప్రవర్తనతో ప్రవర్తించినపుడు మీకు మనసులో ఎలా అనిపించిందో మీ అనుభవాలను కూడా చెప్పండి.

## ఇలా చేయండి.

పెద్దలను గౌరవించడం అంటే

- వారిని ఆప్యాయతతో పలకరించాలి.
- వారు చేసే పనులలో సాయపడాలి.
- పెద్దవారికి మంచినీళ్ళు ఇలాంటివి లేచి వెళ్ళి అందివ్వాలి.
- వరసలతో పిలవాలి.
- వారి దగ్గర కూర్చొని కబుర్లు చెప్పాలి.
- వారు చెప్పే మంచి మాటలను వినాలి.
- వారి అవసరాలను అడిగి తెలుసుకొని నేనేమి చెయ్యగలను అని ఆలోచించాలి.
- బస్సులలో రైళ్ళలో వెళ్ళేటప్పుడు వారికి సీటు ఇవ్వాలి.
- పెద్దలు వచ్చినప్పుడు లేచి నిలబడి వారిని గౌరవంగా ఆహ్వానించాలి.

పై వాటిలో మీరు ఏమేమి చేస్తున్నారు? ఇంకా ఇతరులు చేసేవి చెప్పండి.

## పాట

మంచి బాలలుగ మెలగాలంటే ఏమి చెయ్యాలి?
మనమేమి చెయ్యాలి?
పెద్దలు వస్తే దండంపెట్టి దీవెనలొందాలి.
చిన్నలు వస్తే ఆదరించి వారి నాదుకోవాలి.
అమ్మా నాన్నలు చెప్పే మాటలు ఆచరించాలి.
గురువుకు మ్రొక్కి శ్రద్ధగ చదువును నేర్చుకోవాలి.
ఉత్తమ భారత పౌరులుగా సాగిపోవాలి.
మనమూ సాగిపోవాలి.

## సూక్తి

**పెద్దలను గౌరవించడం, అతిథులను సత్కరించడం, మన భారతీయ సంస్కృతి గొప్పదనం.**

# 9 చెత్తబుట్ట వాడుదాం

| | |
|---|---|
| I. ప్రధాన విలువ | పర్యావరణ పరిరక్షణ |
| II. ఉప విలువ | చెత్తబుట్టలు, మరియు చెత్తకుండీల ప్రాధాన్యతను తెలుసుకోవడం, వినియోగించడం |
| III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు | ♦ పిల్లలు ఇంట్లో, తరగతిగదిలో, రోడ్లపైన చెత్తబుట్టను వినియోగించడంలో చెత్తబుట్ట ప్రాధాన్యతను తెలియజేయడం – పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం.<br>♦ వివిధ సందర్భాలలో చెత్తబుట్టను వినియోగించడంవల్ల కలిగే ప్రయోజనాలను, వినియోగించకపోవడంవల్ల కలిగే నష్టాలను తెలియజేయడం. |

## IV. ఉపోద్ఘాతం

పిల్లలూ! మనం మన పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనకపోతే మనపరిసరప్రాంతమంతా చెత్తకుండీలా తయారవుతుంది. మన ఇంట్లో చెత్త రోడ్డుమీద ఎక్కడబడితే అక్కడపోయకుండా నిర్దేశించబడిన చెత్తకుండీలలో వేయడం వల్ల అనేకరోగాల బారినుండి మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఇంటా, బైటా, తరగతిగదుల్లో ఈ చెత్తకుండీలను వాడడం ఒక అలవాటుగా మార్చుచేసుకోవాలి. చెత్తకుండీలు వాడకపోవడంల్ల కలిగే నష్టాలను, వాడితే కల్గిన ప్రయోజనాలను తెలిపే ఈ సంఘటనలను వినండి.

## V. సంఘటనలు

### సంఘటన – 1

వెంకాయమ్మ, వసుంధర మంచి స్నేహితురాళ్ళు. వసుంధర తన ఇంటిని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొనేది. ఇంట, బైట చెత్తకుండీలను ఉపయోగించడం తనకు బాగా అలవాటైంది. అందుకే ఆమె కుటుంబమంతా ఆరోగ్యంగా ఉండేది.

కానీ, ఉదయం లేస్తూనే ఇంట్లో పనులతో ఎంతో బిజీబిజీగా ఉండే వెంకాయమ్మకు గబగబా ఇంట్లో చెత్తంతా ఊడ్చి తన ఇంటి ముందున్న కాలవ ప్రక్కనే పోయడం అలవాటుగా మారింది. దాంతో పిల్లలకు ఎప్పుడూ వాంతులూ, విరోచనాలు, జ్వరం అంటూ డాక్టర్‌ను కలవడం, ఎంతో డబ్బు వృథా చేసుకోవడం ఆమెకు పెద్ద సమస్యగా తయారైంది. ఒకరోజు జ్వరం వస్తే డాక్టరు దగ్గరకు వెళ్తే మలేరియా జ్వరవమని చెప్పాడు, ఇంటి చుట్టూపక్కల అపరిశుభ్రంగా ఉంటే, మురికి నీటి కాలువలో నీరు నిల్వ ఉండి అందులో దోమలు పెరిగి మలేరియా జ్వరం రావడానికి ఆస్కారం ఉందని డాక్టరు చెప్పారు. ఇంటిల్లపాదికి పట్టుకున్న జ్వరంతో కుటుంబం గడవడం కూడా ఎంతో కష్టమైందని తన స్నేహితురాలైన వసుంధరకు తనబాధనంతా వెళ్ళగక్కింది.

వసుంధరకు కొద్దిపాటి చదువుతోపాటు, లోకజ్ఞానం కలదికావడంతో వెంకాయమ్మ బాధలకు, కష్టాలకు కారణం ఆమె ఇంటి పరిసరాలు అని చూడగానే ఇట్టే పసిగట్టేసింది.

చూడు వెంకాయమ్మా! మనకు ఎంత పనిబిజీగా ఉన్నా మన ఇంటి పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు చెత్తబుట్టను/చెత్తకుండీని ఉపయోగించడం తప్పనిసరిగా చేయాల్సిందే. నువ్వు మీ ఇంట్లో చెత్తంతా ఇంటిముందు కుప్పేయడంవల్ల దోమలు, ఈగలు వాటిలో కాపురం పెట్టాయి. అవి హాయిగా బ్రతుకుతున్నాయి. అవి మీ ఇంటిచుట్టూ పెరిగిపోవడంవల్ల మీఇంట్లో వారిపై దాడిచేయడం, వాటివల్ల మీరంతా రోగాలబారిన పడడానికి కారణమైంది. పంచాయితీవాళ్ళు, డాక్టర్‌లు ఎంత చెప్పినా వినకుండా మురుగును, చెత్తను నిల్వఉంచుకొని రోగాల బారిన పడుతున్నారు.

"అంతేనంటావా వసుంధరమ్మా! ఈచిన్న విషయం నేను తెల్సుకోలేకపోయినానే! ఇదిగో – ఇప్పుడే మొత్తం శుభ్రం చేస్తానుందు" అంటూ వెంకాయమ్మ ఇల్లంతా శుభ్రంచేసి చెత్తకుండీలను వాడడం అలవాటు చేసుకుంది. ఇంకెప్పుడూ రోగాల బారిన పడి డాక్టర్ దగ్గరకు వెళ్ళాల్సిన అవసరమే ఆమెకు రాలేదు. చెత్తను చెత్తబుట్టలో వేసి, చెత్తకుండీలోమాత్రమే వేయడం అలవాటు చేసుకున్నారు.

### సంఘటన – 2

అతనిపేరు అనంతు. ఊరు వెళ్ళాలని స్టేషన్‌కు వచ్చాడు. టిక్కెట్టు కొనుక్కొని రైలు ఎక్కాడు. అతనికి బాగా ఆకలిగా అనిపించింది. ఇంతలో అటుగా అరటిపళ్ళబండి వచ్చింది. అనంతు అరటి పళ్ళుకొన్నాడు. ఒక్కక్కటీ నింపాదిగా వలుచుకుని ఆవురావురంటూ తిన్నాడు. తొక్కలన్నీ కిటికీ లోంచి ఫ్లాటుఫాం మీదకు పడేశాడు.

ఇంతలో ఫ్లాటుఫారం మీద దబ్బుమని చప్పుడు, కేకలు ఆ గోలకు అనంత కిటికీలోంచి బయటకు చూశాడు. ఎవరో ప్రయాణీకుడు పాపం తనే సామాను తీసుకువస్తూ అరటితొక్కపై కాలువేశాడు. కాలు జారి

*వెంటనే బోర్లాపడ్డాడు. చుట్టూ జనం అతన్ని లేవదీసి కూర్చోబెట్టారు. పాపం మోకాలు మోచేతులు గోక్కుపోయాయి. కాలు బెణికిందో ఏమో-సరిగ్గా నించోలేకపోతున్నాడు.*

*అప్పుడు అనంతుకు తాను పారేసిన అరటి తొక్కలు కళ్ళబడ్డాయి. వాటిమీద కాలేసిజారిపడ్డాడన్నమాట.*

*చూశారుగా పిల్లలూ! అనంతు ఆలోచనలేకుండా చేసిన పనివల్ల ప్రయాణీకుడికి ఎంత అపకారం జరిగిందో?*

*అనంతు అలా అరటి తొక్కలని అలా నలుగురూ నడిచేదారిలో పారెయ్యకుండా ఉంటే--- కొంచెం ఓపిక చేసుకొని ఆ తొక్కలని చెత్తకుండీలో వేసి ఉంటే ఆ ప్రమాదం జరిగేదా? పాపం ఆ ప్రయాణీకుడు అలా బోర్లాపడేవాడా? ఆలోచించండి.*

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) వెంకాయమ్మకుటుంబంలోని వారు ఎప్పుడూ రోగాలబారిన పడడానికి కారణం ఏంటి?

2) పరిసరాల పరిశుభ్రతకోసం చెత్తకుండీలను వినియోగించకపోతే కలిగే నష్టాలను తెల్పండి.

3) చెత్తకుండీలను వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు చెప్పండి.

4) పండ్లతొక్కలు, బిస్కెట్టు ప్యాకెట్ల కవర్లు మొదలైనవి ఎక్కడపడితే అక్కడ పారేయడం వల్ల ఏమి జరుగుతుందో చెప్పండి.

5) మనం తినే తొక్కలు, చిప్పలూ, కవర్‌లు ఎక్కడ వేయాలి?

6) చెత్తకుండీలు లేకపోతే పరిసరాలు ఎలా ఉంటాయో చెప్పండి.

7) చెత్త బుట్టలు ఎక్కడ పెట్టాలి?

### తెలుసుకోండి

రోజూ మన ఇండ్లలోని, షాపుల్లోని చెత్తను వీధిలోకి పారేయడంవల్ల అవి గాలికి తిరిగివచ్చి ఇళ్ళలోనే చేరుతున్నాయి. రోడ్లపై పారవేయడంవల్ల అవి ఎండకు ఎండి, వానకు తడిసి కుళ్ళి దోమలు లాంటివి పుట్టడానికి కారణం అవుతున్నాయి. దానివల్ల అనేక రోగాలు వస్తున్నాయి. అందువల్ల ఇల్లు, బడి మొదలైన ప్రదేశాలలోని చెత్తను కుండీలలోనే వేయాలి. దానివల్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయి. కాల్వలు నిండిపోవు. అనారోగ్యములు కలుగవు. తప్పనిసరిగా చెత్తను కుండీలలో వేయాలి. ఇతరులకు చెప్పి చెత్తకుండీలను ఉపయోగించేలా చేయాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

1) పిల్లలూ! రెండు సంఘటనలలోని పాత్రలకు తగినట్లుగా నాటకీకరణ చేయండి.

2) క్రింది సూచనలను చదివి తగిన విధంగా అభినయించండి.

అ) ఇద్దరు పిల్లలు తరగతిగదిని ఊడ్చి, చెత్తను చెత్తకుండీలో వేస్తున్నట్లుగా అభినయించడం.

ఆ) "పరిసరాల పరిశుభ్రతను గూర్చి చెత్తకుండీలను ఉపయోగించండి." అని చాటింపు వేస్తున్నట్లుగా నటించండి.

3) మీ ప్రాంతంలో చెత్తను ఎక్కడ వేస్తారు?

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీరు ఇంట్లో మరియు తరగతిగదిలోని చెత్తను రోజు చెత్తకుండీలలో వేయండి. వారం రోజుల తరువాత మీ పరిసరాలు ఎలా ఉన్నాయో మీకు ఏమనిపించిందో చెప్పండి.

## ఇలా చేయండి.

- చెత్తబుట్ట కొనిపెట్టక్కరలేదు. ఒక అట్టపెట్టెను చెత్తబుట్టగా వాడవచ్చు.
- మీ ఇంట్లో వంటింట్లో ఒకటి, గదిలో ఒకటి చెత్తబుట్ట ఏర్పాటు చేయండి. ఇంట్లో చెత్తను చెత్తబుట్టలో వేయండి.
- చెత్తబుట్టలోని చెత్తను రోజూ వీధిలోని చెత్తకుండీలో వేసిరండి.
- బడిలో తరగతికొక చెత్తబుట్టను ఏర్పాటుచేసుకోండి.
- తడి చెత్త, పొడిచెత్త వేరుచేసి వేయండి.
- తడిచెత్త ఎరువు తయారు చేయడానికి ఉపయోగపడుతుంది.
- మీరు కాకుండా మీ చుట్టుపక్కలవాళ్ళు చెత్తబుట్ట వాడేలా చూడండి.

**సూక్తి**

**ఇంట్లో, బయట పరిశుభ్రంగా ఉంచుకోవడం మన బాధ్యత దీనివల్ల మన ఆరోగ్యంతోబాటు అందరి ఆరోగ్యం కాపాడినవారమౌతాము.**

# 10 నిజాయితీగా ఉందాం

**I. ప్రధాన విలువ** → శాస్త్రీయ దృక్పథం

**II. ఉప విలువ** → నిజాయితీగా అంగీకరించడం

**III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు** →

- తప్పు చేస్తే నిజాయితీగా ఒప్పుకోవాలి.
- ఒక పనిని చేసేటప్పుడు వచ్చే ఫలితాలకు తానే బాధ్యత వహించాలి. ఒకవేళ ఫలితాలుసరైనవిగా రాకపోయినా, నష్టం కలిగించేవిగా వచ్చినా దానికి కారణం తామేనని అంగీకరించగలగాలి.

## IV. ఉపోద్ఘాతం

తప్పులు చేయడం మానవ సహజం. మనం చేసే పనులలో పొరపాట్ల వల్లకూడా తప్పులు జరుగుతుంటాయి. కాని వాటిని ఎప్పటికప్పుడు సరిచేసుకోవడమే మానవనైజం. చేసిన తప్పులను నిజాయితీగా ఒప్పుకుంటే తప్పు చేసానన్న భావం పోతుంది. చేసిన తప్పులు ఒప్పుకోవడం వల్ల గౌరవం కూడా పెరుగుతుంది. ఇది పరగాలంటే నిజాయితీగా మన తప్పులు మనం ఒప్పుకోవడం చేతకావాలి. ఇలా నిజాయితీగా తప్పులు ఒప్పుకున్న ఒక విద్యార్థి కథను వినండి.

## V. సంఘటన

రోజు మాదిరిగానే ఆరోజు కూడా పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయుడు ఇంటిపని ఇవ్వడం జరిగింది. మరుసటిరోజు విద్యార్థులందరూ వారు చేసుకువచ్చిన ఇంటిపనులను చూపిస్తున్నారు. అందులోంచి కొంత మంది తప్పులు చేశారు, మరికొంత మంది అసలే చేయలేదు. వారందరికీ ఉపాధ్యాయుడు చివాట్లు పెడుతున్నాడు. కాని ఒక విద్యార్థి మాత్రం ఇంటిపనిలో ఇచ్చిన అన్ని లెక్కలు సరిగ్గా చేశాడు. దీంతో ఆ ఉపాధ్యాయుడు ఆ విద్యార్థిని దగ్గరకు పిలుచుకొని అందరిముందు గొప్పగా చెబుతూ "ఈ ఒక్క విద్యార్థి మాత్రమే ఇచ్చినవన్ని సరిగ్గా చేశాడు. వీడిని చూసి నేర్చుకోండి" అని మెచ్చుకున్నాడు. కానీ ఆవిద్యార్థి మనస్సులో ఏదో భయం కనిపిస్తోంది. కళ్ళలో నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. విద్యార్థి ఇక ఆగలేక "సార్ క్షమించండి! మీరిచ్చిన ఈ ఇంటిపని నేను చేయలేదు. మా అన్నయ్య చేసిచ్చాడు." అని చెప్పాడు. అది విన్న ఉపాధ్యాయుడు "ఎందుకు నీవు చేయలేకపోయావు" అని అడిగేసరికి" నాకు మీరు ఇంటి పనిగా ఇచ్చిన లెక్కలు అర్థం కాలేదు. అందుకే చేయలేకపోయాను. మీరు ఎక్కడ కొడతారోనని భయంతో మా అన్నయ్యను అడిగాను. అప్పుడు అన్నయ్యే ఈ లెక్కలన్నీ చేసి ఇచ్చాడు" అని చెప్పాడు. "సరే అర్థంకానివేమైనా ఉంటే అడిగి తెలుసుకోవాలిగాని ఇతరులతో చేయించరాదు కదా! ఇంకోసారి ఇలాంటి పొరపాటు చేయవద్దు, ఎందుకంటే నీవు నాకు చెప్పకపోయివుంటే ఇవన్నీ నీవే చేసి ఉంటావని అనుకునేవాడ్ని, అయినా నిజాయితీగా చేసిన తప్పులను అంగీకరించావు" అని ఆ విద్యార్థిని ఉపాధ్యాయుడు అభినందించాడు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) ఉపాధ్యాయుడు విద్యార్థిని ఎందుకు అభినందించాడు.

2) విద్యార్థి తన తప్పులను ఒప్పుకున్నాడు కదా! కారణం ఏమై ఉంటుంది?

3) ఒకవేళ విద్యార్థి తన తప్పులను ఒప్పుకుని ఉండకపోతే ఏమి జరిగి ఉండేది?

4) నిజాయితీగా ఉండటం అంటే ఏమిటి?

### తెలుసుకోండి

ఈ ప్రపంచంలో తప్పులు చేయని వారు అంటూ ఎవరూ ఉండరు అప్పుడప్పుడు మనం కూడా మన దైనందిన జీవితంలో మనకు తెలియకుండానే ఎన్నో తప్పులు చేస్తూ ఉంటాము. తెలిసో తెలియకో చేసిన ఆ తప్పులకు బాధ పడకుండా, చేసిన తప్పులను నిజాయితీగా అంగీకరించగలిగే మనస్తత్వాన్ని పెంపొందించుకోవాలి. ఆ తప్పులను మరోసారి చేయకుండా ఉండటానికి ప్రయత్నించాలి.

## ఆ) తరగతి కృత్యం – జట్టుపని

- విద్యార్థులందరినీ జట్లుగా చేసి ఈ కృత్యాన్ని చేయించాలి.
- మీరు ఏయే సందర్భాల్లో మీ నిజాయితీని నిరూపించుకున్నారు? ఎప్పుడెప్పుడు అబద్ధం చెప్పారు.

## ఇ) ఆచరించడం – అనుభవాలు చెప్పడం

- మీ ఇంట్లో మీరుగాని/మీకుంటుంబ సభ్యులుగాని నిజాయితీగా ఉండి, తప్పులను అంగీకరించిన సంఘటనలు తెల్పండి / రాయండి.

### మీకు తెలుసా!

ఒక పదార్థం విలువ దాని గుణంపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు చెట్టుకు విలువ దాని పండ్లపైన, చెరకుకు విలువ దాని రసంపైన, ఎద్దుకు విలువ దాని బలంపైన అదే విధంగా మనిషికి విలువ వారి మంచి గుణాలపైన ఆధారపడి ఉంటాయి. సత్యం, ధర్మం, నిజాయితీ, త్యాగము, శాంతి, ప్రేమ, క్రమశిక్షణ, అహింస, దానం, ధైర్యం వంటి గుణాలు మనిషికి సమాజంలో గుర్తింపునిస్తాయి.

### సూక్తి

**చూసింది చూసినట్లు చెప్పడం, చెప్పింది చెప్పినట్లు చేయడం, మాటకు కట్టుబడి ఉండడం నీ నిజాయితీని తెలుపుతుంది.**

# 11 అన్యాయం

| | |
|---|---|
| I. ప్రధాన విలువ → | న్యాయం |
| II. ఉప విలువ → | జంతువుల పట్ల అన్యాయంగా ప్రవర్తించడాన్ని ప్రశ్నించడం |
| III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు → | ♦ అన్యాయం జరుగుతున్నదని గుర్తించడం, ప్రశ్నించడం తెలుసుకోవాలి. అన్యాయాలు జరుగకుండా చూడాలి. |

## IV. ఉపోద్ఘాతం

మన చుట్టూ ఉన్న సమాజంలో మనతోపాటు ఎన్నో జీవరాశులు ఉన్నాయి. మూగజీవులన్నీ మనతో సమానంగా బతికే హక్కు ఉంది. మూగ జీవులను హింసించడం అన్యాయం. అన్యాయం జరుగుతున్నప్పుడు అది గుర్తించడం, ప్రశ్నించడం తప్పకుండా చేయాలి. ఎవరూ ప్రశ్నించకపోతే అన్యాయాలు జరుగుతూనే ఉంటాయి.

## V. కథ

ధనయ్య రోజు ఎద్దుల బండిపై సరుకులు వేసుకొని పట్నం వెళ్తూ వ్యాపారం చేసేవాడు. ఆ ఎద్దులు కొంతకాలానికి ముసలివై పోయాయి. శక్తి సన్నగిల్లింది. అయినా దయలేని ధనయ్య బండిలో బండెడు సరుకులు వేసి వాటిని లాగమని కొట్టేవాడు. దారి మధ్యలో ఎద్దులు బండిని లాగలేక కూర్చుండిపోయేవి.

ఇదంతా ధనయ్య కొడుకు యశ్వంత్ చూశాడు. పాపంనోరులేని ఎద్దులను నాన్న అలా కొడుతూ ఉంటే చాలా అన్యాయం అనిపించింది. అది చూసి ఉండలేక "నాన్నా దాన్ని ఎందుకలా కొడుతున్నావు," అని అడిగాడు. "ఇవి నడువలేకపోతున్నాయిరా" అని అన్నాడు ధనయ్య. వెంటనే యశ్వంత్ తండ్రితో "వాటి వయసైపోయింది, వాటికి మునుపటిలాగా శక్తి ఉండదుకదా! అందుకే లాగలేకపోతున్నాయి" అని చెప్పాడు. "అదేం కాదు రెండు బాదితే అవే లేస్తాయి చూడూ" అని మళ్ళీ రెండు బాదబోయాడు ధనయ్య. "వద్దు నాన్నా కొట్టకు, అని తన తండ్రి చేతిలోని కర్రను లాక్కుని" పాపం అవికూడా మనలాగే ప్రాణమున్న జీవులు. నీవు కొడుతూ ఉంటే వాటికి బాధకలగదా? వాటిపై అవి మోయలేనంత బరువు వేసి నడిపించడం నీకు అన్యాయం అనిపించడం లేదా, ఒక్కసారి మీరు ఈ రెండు బియ్యం బస్తాలు మోయండి. మోయగలరో లేదో చూద్దాం" అన్నాడు యశ్వంత్. తన కొడుకు మాటలువిని ధనయ్య ఆలోచనలో పడ్డాడు. "నిజమే! ఇన్నాళ్ళు నాకోసం ఈ ఎద్దులు ఎంతో పనిచేశాయి. అవి ముసలయ్యాక కూడా ఇంత బరువు వేసి వాటిని లాగమనడం అన్యాయమే అవుతుంది. ఈ విషయం నాకెందుకు తోచలేదు, అనుకుంటూ ఎద్దులను బండి నుండి విడిపించాడు.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) కథలో ఎద్దుల పట్ల ధనయ్య ఎలా ప్రవర్తించాడు? అది సరైనపనేనా?

2) మీచుట్టు పక్కల ఇలా జంతువుల పట్ల అన్యాయంగా ప్రవర్తించడం మీరు చూశారా? చెప్పండి.

3) సంతోష్ పాఠశాలకు వచ్చేటప్పుడు, సెలవు అయ్యాక ఇంటికి వెళ్ళేప్పుడు దారిలో కనిపించే మూగజీవాలు కుక్కలు, కోళ్ళు, పశువులను ఇలా కనిపించే వాటినన్నింటిని రాయితో కొట్టేవాడు. అది తప్పు అని ఎవరైనా వారిస్తే నవ్వుతూ వెళ్ళిపోయేవాడు.

అ) సంతోష్ చేసిన పని సరైనదేనా? ఎందుకు?

ఆ) సంతోష్ రాళ్ళతో కొడుతూ ఉంటే మూగజీవులు ఎలా బాధపడి ఉంటాయి?

ఇ) జంతువుల పట్ల అన్యాయం జరుగుతుంది అంటున్నాం కదా? అవి ఎన్ని రకాలుగా జరుగుతుంటాయి?

4) మనకు ఆహారం మన అమ్మానాన్నలు పెడుతున్నారు. మరి మన చుట్టుప్రక్కల ఉన్న జంతువులకు ఎవరు పెడతారు? వాటిపట్ల మనకు బాధ్యత ఉన్నదా? లేదా?

5) జంతువులకు ఆకలి అయినప్పుడు ఎలా? ఎవరైనా సహకరించాలా వద్దా - మీరైతే ఏం చేస్తారు?

6) మన చుట్టుప్రక్కల ఉన్న జంతువులు సంతోషంగా ఉండాలంటే, మనలాగే జీవించాలంటే మనమేం చేయాలి?

**తెలుసుకోండి**

ప్రకృతిలో మనుషులతో పాటు పక్షులు, జంతువులు, కీటకాలు, మొక్కలు ఇలా ఎన్నో జీవిస్తున్నాయి. వీటన్నింటిని కలిపి జీవవైవిధ్యం అంటారు. వీటన్నిటి వల్ల ప్రకృతి అందంగా, ఆహ్లాదంగా ఉంటుంది. మనుషులు ప్రకృతిని రూపొందించనప్పటికీ వాటిని కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉంది. ప్రకృతిలో మనకు జీవించడానికి ఎంత హక్కు ఉందో, ప్రాణం ఉన్న అన్ని జీవులకు అంతే హక్కు ఉంది. మానవత్వం ఉంటుంది కాబట్టే మనల్ని మనుషులు అంటున్నారు. మనం దయ, సానుభూతి, కరుణ ఇతర జంతువులపట్ల చూపడం కనీసమానవ ధర్మం. ఈధర్మాన్ని మనం పాటించాలి. మూగ జీవాలైన జంతువులు, పక్షులు, కీటకాలను హింసించడం, వాటిని రకరకాల బాధలకు గురిచేయడం వాటిపట్ల అశ్రద్ధ కనపర్చడం సరైందికాదు. మనుషులుగా మనం వాటిని ప్రేమించాలి. చేతనైన రీతిలో వీటికి సేవచేయాలి అంటే పక్షుల కోసం గిన్నెలలో నీళ్ళుపోసి ఇంటిపైన ఉంచడం, వాటికి గింజలు వేయడం మొ॥వి చేయాలి.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- తరగతి గదిలో విద్యార్థులను రెండు జట్లుగా చేయాలి. మొదటి జట్టు అడిగితే రెండవ జట్టులవారు చెప్పాలి. తర్వాత రెండువ జట్టువారు అడిగితే మొదటి జట్టువారు చెప్పాలి.
- జంతువుల / పక్షుల పట్ల మనం ఎలా ప్రవర్తించాలి. (జట్ల వారిగా చర్చ నిర్వహించాలి)

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీరు ఏ జంతువు పట్ల సానుభూతితో ఎలా ప్రవర్తించారో చెప్పండి.
- మీ చుట్టుప్రక్కల, ఎవరు జంతువులకు సహాయపడుతున్నారు. చెప్పండి?
- మీరెప్పుడైనా జంతువులకు ఆహారం, నీరు పెట్టారా. మీకేమనిపించింది. వాటిని ఈవిధంగా సహాయం చేసి మీ అనుభవాలను చెప్పండి.

మన దేశంలో సమస్త ప్రకృతిపైనా ప్రేమ, సహృదయము ప్రకటించడం కనబడుతుంది. చీమకు పంచదార వెయ్యడం, పాముకు పాలు పొయ్యడం ఇలాంటివన్నీ ప్రేమకు, సహృదయతకు నిదర్శనాలు. ఈ గుణాలు పెంపొందించుకున్న వ్యక్తులు స్నేహగుణంతో మరింతగా పరిణతి చెందగలిగారు. విద్యార్థులు కూడా కలిసిమెలిసి ఆడుటద్వారా కలిసి మెలిసి గడుపుటద్వారా తినుబండారములు కలిసి మెలిసి భుజించుట ద్వారా స్నేహగుణాన్ని పొందగలుగుతారు. శ్రీకృష్ణుడు చిన్ననాడు గోపబాలురతో కలిసి చల్దిని భుజించగలగడం ఎంతటి స్నేహం. స్నేహగుణం మనలో ఐకమత్య భావనను పెంపొందిస్తుంది. కాబట్టి ప్రేమ, సహృదయం స్నేహం అనే గుణాలను అలవర్చుకోవాలి.

**సూక్తి**

**జంతువులను హింసించడం**
**మహా పాపమేకాదు,**
**నేరం కూడా.**

# 12 వాటికీ బాధ కల్గుతుంది

| | |
|---|---|
| I. ప్రధాన విలువ → | శాంతి, కలిసిమెలిసి జీవించడం |
| II. ఉప విలువ → | ప్రకృతిలోని జీవజాలానికి బాధ కలగకుండా చూడడం. |
| III. ఆశించిన ఫలితాలు / లక్ష్యాలు → | ♦ ప్రకృతిలోని జీవరాశికి బాధకలిగించకుండా చూడడంలో బాధ్యతను తెలుసుకుంటారు. |

## IV. ఉపోద్ఘాతం

ప్రకృతిలోని సమస్త జీవరాశి మనుషులతో సమానంగా జీవించే హక్కు ఉంది. మనుషులలాగే అవి బాధకల్గితే బాధపడ్తాయి. అందుకే మనం వాటికి బాధ కల్గించకుండా చూడాలి దాంతోపాటు మనం వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలి. ప్రకృతిలోని ప్రతి అంశం మనిషికి ఎంతో ఉపయోగపడుతుంది. మనం ప్రకృతిలో ఒక భాగం. అలాంటి ప్రకృతిలో మనతోపాటు ఉండే మొక్కలు, జంతువులపట్ల మనమెలా ప్రవర్తించాలో తెలియజేసేదే ఈ కథ.

## V. కథ

రవి చాలా అల్లరివాడు. చేతులు అసలే ఊరుకోవు. ఇంట్లో నుండి బయట పడ్డాడంటే రాళ్ళను కాలితో తన్నడం, మొక్కలను తొక్కుకుంటూపోవడం, మొక్కల కొమ్మలు విరిచివేయడం, పూలు తెంపేయడం వంటివి చేస్తుంటాడు. శ్రావ్య రవి అక్క. పూలచెట్లను ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకుంటుంది. ఒకరోజు ఇలాగే రవి మంచి గులాబి పువ్వు పూసిన కొమ్మని విరిచేసాడు. పువ్వుతో ఉన్న కొమ్మ వాడిపోయింది. ఇది చూసిన శ్రావ్య 'ఒరేయ్ ఆ మొక్క నిన్నేమి చేసిందని దాన్ని అలా విరిచేశావు?' అని అడిగింది. పోతేపోయిందిలే, అవేం నీతో నొప్పి అని చెప్పిందా? అన్నాడు. చెప్పకపోయినా గమనిస్తే నీకే తెలుస్తుంది. వాటికి కూడా ప్రాణం ఉంటుంది అవి కూడా బాధకలిగినా ఆనందం కల్గినా స్పందిస్తాయని జగదీష్‌చంద్రబోస్ చెప్పాడట మా సైన్స్ టీచర్ చెప్పింది. నిజంగానే నేను కూడా గమనించాను మనం నీళ్ళు పోస్తే అవి ఎంత ఆనందంగా గాలికి కదులుతూ మనకు కృతజ్ఞతలు చెబుతుందో! తెలుసా!

ఇప్పుడు చూడు నువ్వు విరిచేసరికి కొమ్మపై బాధగా తలవాల్చేసింది. అంది.

రవికి ఆశ్చర్యం వేసింది. నిజంగానే మొక్కలు బాధ పడతాయా ఒక్కసారి ఆలోచించాడు. మరైతే ఇప్పుడెలా అడిగాడు.

ఆ విరిగిపోయిన కొమ్మను ఒక కర్ర సహాయంతో నిలబెట్టి కట్టి, దానికి నీళ్ళుపోసి రేపుచూడు ఎలా ఉంటుందో.

అక్క చెప్పినట్టే చేశాడు రవి. రాత్రయింది అందరు పడుకున్నారు. రవికి నిద్రపట్టలేదు. ఎప్పుడెప్పుడు తెల్లారుతుందా ఆ మొక్క ఎలా ఉందా అని ఆలోచిస్తూ పడుకున్నాడు. తెల్లారింది. రవికి మెలకువ వచ్చింది. మొక్క జ్ఞాపకం వచ్చింది. గబగబా లేచి మొక్క దగ్గరికి వెళ్ళాడు. నిన్న వాలిపోయిన కొమ్మ నిటారుగా ఉంది. పువ్వు కూడా వాడినట్టుగా కాకుండా బాగా వికసించి ఉంది. పక్కనే ఇంకొక మొగ్గ వేసింది. రవికి చాలా సంతోషంకల్గింది. ఇంతలో అక్కడకి శ్రావ్య వచ్చింది.

"అక్కా! నువ్వు చెప్పింది నిజమే ఈ కొమ్మలేచి నిలబడింది. నన్ను చూసి ఆనందంగా పలకరించినట్లు అనిపించింది" అన్నాడు సంతోషంగా. ఇక ఎప్పుడూ తొక్కడం, విరచడం వంటివి చేయను. నేను నీలాగే మొక్కలను పెంచుతానక్కా! అన్నాడు. వెరీగుడ్ రవి! మీ స్నేహితులతో కూడా చెప్పు అంది శ్రావ్య.

## VI. అ) ఆలోచించడం - ప్రతిస్పందించడం

1) మన చుట్టూ మనతోపాటు ఏఏ జీవరాశులు ఉన్నాయో చెప్పండి. వాటపట్ల మీరు ఎలా ఉంటున్నారు?

2) మొక్కలు, జంతువులను హింసించడం తప్పుకదా! ఏఏ పనులు చేయడంవల్ల అవి బాధపడుతాయో చెప్పండి.

3) ప్రకృతిలోని మొక్కలు జంతువులు మనతోపాటే ఉంటూ మనకు ఏమేమి ఇస్తున్నాయి? మనం వాటికి ఏమేమి ఇస్తున్నాం.

4) నీ చుట్టూ ఉన్న మొక్కలు, జంతువులలో వేటిని ప్రేమతో పెంచుతున్నారు? అలా పెంచుతుటే మీకెలా అనిపిస్తుంది?

**తెలుసుకోండి**

మొక్కలు, చెట్లు, ఇతర జీవరాశులపై మనం ఏదో ఒక రకంగా మన అవసరాలు తీర్చుకోవడం కోసం ఆధారపడుతున్నాం. మొక్కలు, చెట్లులేని ప్రపంచాన్ని మనం ఊహించలేం అవి లేకుండా మనం బతకలేము కూడా. మన ఆహారం, మన అవసరాలకు మనం ప్రకృతిలోని వివిధ అంశాలపై ఆధారపడ్డం మొక్కలు ఆహారంగాను, పూలతో సువాసనను, కనులకు ఆనందం కల్గించడానికి, వైద్యం అందించడంలోను, మనకు ప్రాణవాయువును అందించడంలోను ఇతర జంతువులకి మనకు ఆహారాన్ని అందించడంలోను నిస్వార్థంగా మనకు అన్నీ అందిస్తున్నాయి. అటువంటి మొక్కలను కాపాడుకోవడం మన బాధ్యత.

## ఆ) తరగతి కృత్యం - జట్టుపని

- ప్రకృతిలో ఉన్న మొక్కలు, జంతువులను కాపాడుకోవడం కోసం మనం ఏమేమి చేయాలి? జట్లలో చర్చించి రాయండి.

## ఇ) ఆచరించడం - అనుభవాలు చెప్పడం

- మీ ఇంట్లో మొక్కలు పాతి రోజూ దానికి నీళ్ళుపోసి సంరక్షించండి. మీ అనుభూతులు చెప్పండి.
- మీ ఇంట్లోకి వచ్చే పక్షులకు, దారినపోయే జంతువులకు తినడానికి ఏమైనా పెట్టండి. తాగడానికి నీళ్ళు పెట్టండి. మీకెలా అనిపించిందో చెప్పండి.

**మీకు తెలుసా!**

ప్రకృతిలో చెట్లు, జంతువుల లాగా మనం కూడా భాగమే. ఈ ప్రకృతి అందరిది. కానీ ప్రకృతిని వాటికి దక్కకుండా చేసి, అంతా మనకే కావాలని ఆవిధంగా చేయడం లోభం, స్వార్థం. స్వార్థం ఉన్న దగ్గర మంచితనం ఉండదు. మంచి వాళ్ళు ఉండరు.

## పచ్చని కవితలు

ఒకప్పుడు
మా ఇంటికి బంధువులొచ్చేవారు
ఉమ్మడి కుటుంబమంత ఉత్సాహంగా ఉండేది.
ఒకప్పుడు
మా కిటికీల మీద పిచ్చుకలు వాలేవి
ఎంత సంతోషంగా ఉండేదో !
ఇప్పుడు
బంధువులూ లేరు, పిచ్చుకలూ రావు

ఆ వికలాంగుడికి
చంక కర్రలు దానం చేసిన
ఆ చెట్టు తల్లి ఎవరో
ఆమెను తలచుకుంటే
హృదయంలో వసంతం పూస్తుంది

నరికిన వృక్షమంటే
అది నా తల్లి పక్షమే
వాడెవడో
గూండాలాంటి గొడ్డలితో
అడ్డంగా
నా తల్లి కాళ్లు నరుకుతున్నాడు

ఋషులు
చెట్లకింద తపస్సు చేస్తారు
దుర్మార్గులు
వాటికిందే ఒకటి పోస్తారు
ఇప్పుడు ఋషులు లేరు

చెట్టుతల్లి
తన కొమ్మలతో ఇలా అంది

అమ్మలారా !
కొంతకాలం ఆకులమాటునే ఉండండి
పళ్ళుగా మారితే
ఎలాగూ రాళ్ళ దెబ్బలు తప్పవు

ఉదయాన్నే లేచి
వృక్షానికి నమస్కరించాను
ఆ రోజంతా
నా తలమీద నీడలే నీడలు

ఒకప్పుడు
నగర ముఖంలో పచ్చని నవ్వు కనిపించేది
ఇప్పుడా శోభ లేదు
పొగలతో కాలుష్యపు పగలతో రగులుతోంది.

– డా॥ ఎండ్లూరి సుధాకర్

**సూక్తి**

**మన చుట్టూ ఉన్న మొక్కలు, జంతువులు మనతో సమానంగా జీవించే హక్కును కలిగిఉన్నాయి.**

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు / గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

అనుబంధంలో ఉన్న శ్లోకాలు, పద్యాలు పాటలు, కథలు, స్ఫూర్తిదాతల చరిత్రలు మొదలగు వాటిని తరగతి గదిలో పిల్లలచే చదివించాలి. దానిపై మాట్లాడించాలి. ఉపాధ్యాయులు దాని ప్రాశస్త్యం గురించి వివరించాలి.

# 1. శ్లోకాలు

అఖండ మండలాకారం – వ్యాప్తం యేన చరాచరం
తత్పదం దర్శితం యేన – తస్మై శ్రీ గురువే నమః ॥

**భావం :** చరాచర సృష్టియందంతటనూ ఆ పరమేశ్వరుడు వ్యాపించి యున్నాడు. అట్టి పరమేశ్వరుని దర్శింపచేసిన శ్రీ గురుదేవులకు నమస్కరించుచున్నాను.

స్వస్తి వచనము :

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు – సర్వేషాం శాంతిర్భవతు
సర్వేషాం మంగళం భవతు – సర్వేషాం పూర్ణం భవతు ॥
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ॥

**భావం :** అందరికి శుభమగుగాక ! అందరికీ శాంతి కలుగుగాక ! అందరికీ మంగళమగు గాక ! అందరికీ సుఖము ప్రాప్తించుగాక ! అందరికీ శాంతి కలుగుగాక !

పరోపకారాయ ఫలన్తి వృక్షాః పరోపకారాయ వహన్తి నద్యః ।
పరోపకారాయ దుహన్తి గావః పరోపకారార్థ మిదం శరీరం ॥

**భావం :** పరోపకారము కొరకే వృక్షములు ఫలములనిచ్చుచున్నవి. పరోపకారము కొరకు నదులు ప్రవహించుచున్నవి. పరోపకారము కొరకే గోవులు పాలనిచ్చుచున్నవి. కాబట్టి వాటిచే వృద్ధిపొందిన ఈ శరీరము కూడా వాటివలెనే పరోపకారము కొరకు ఉపయోగపడవలెను.

# 2. పద్యాలు

1 తన కోపమె తన శత్రువు
తన శాంతమె తనకు రక్ష దయచుట్టంబౌ
తన సంతోషమె స్వర్గము
తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ !

**భావం :**

తనకోపమే తనకు శత్రువు. తన శాంతమే తనను రక్షిస్తుంది. తన దయాగుణమే తనకు బంధువు. తన సంతోషమే తనకు స్వర్గము. తన దుఃఖమే తనకు నరకము. మనిషి కష్టానికైనా, సుఖానికైనా అతని వ్యక్తిత్వమే మూల కారణము.

2 కష్టపెట్టబోకు కన్నతల్లి మనస్సు
నష్టపెట్టబోకు నాన్న పనులు
తల్లిదండ్రులన్న దైవసన్నిభులురా
లలిత సుగుణ జాల! తెలుగు బాల !!

**భావం :**

తల్లిదండ్రులు ప్రత్యక్షదైవములు. కావున తల్లి మనస్సును నొప్పించుట, నాన్న పనులు నష్టపరచుట చేయరాదు.

3 బ్రతికి నన్నినాళ్ళు ఫలములిచ్చుటెగాదు
చచ్చికూడ చీల్చి యిచ్చు తనువు
త్యాగ భావమునకు తరువులే గురువులు
లలిత సుగుణ జాల! తెలుగు బాల !!

**భావం :**

చెట్లు బ్రతికినంతకాలం మధురమైన ఫలముల నిస్తాయి. చనిపోయిన తర్వాత కూడా చెట్లు కలపగా, వంట చెఱకుగా ఉపయోగపడుతున్నాయి. త్యాగ భావముతో చెట్లను మించినవి మరియేవియూ లేవుకదా !

4 అన్ని దానములకు నన్నదానమె గొప్ప
కన్నవారి కంటె ఘనులు లేరు
ఎన్నగురుని కన్న నెక్కుడు లేదయా !
విశ్వదాభిరామ వినుర వేమ !

**భావం :**

దానములలో కెల్ల అన్నదానం గొప్పది. కన్నవారికన్నా మించిన దైవం లేదు. అలాగే విజ్ఞానాన్ని, వివేకాన్ని ఇచ్చేగురువు కాన్న అధికుడు లేదు.

5 పూజ కన్న నెంచ బుద్ధి ప్రధానంబు
మంటకన్న నెంచ మనసు దృఢము
కులముకన్న మిగుల గుణము
విశ్వదాభిరామ వినురవేమ !

**భావం :**

పూజ చేయుటకన్న మంచి బుద్ధిని గలిగి ఉండుట మంచిది. మాటలు చెప్పడం కన్న మంచి మనస్సు కలిగి ఉండడం మంచిది. కులము కంటె గుణము ముఖ్యమైనది.

6 ఎద్దుకైన గాని యేడాది తెలిపిన
మాట తెలిసి నడుచు మర్మమెరిగి
ముప్పు తెలియ లేదు ముప్పదేండ్లకునైన
విశ్వదాభిరామ వినురవేమ !

**భావం :**

ఒక సంవత్సరం పాటు శిక్షణ నిచ్చిన ఎటువంటి పశువైనా క్రమశిక్షణతో చెప్పిన మాటలు వినును. కాని ముప్పయి సంవత్సరాలు ఎంతగా చెప్పినా మూర్ఖుడు మాత్రము మంచిని తెలుసుకొనలేడు.

7 అమ్మజోలపాట, అత్యంత మధురమూ
భావరాగ, తాళ, భజన వలదు
అమ్మయనెడి మాటకమ్మని రాగమూ
శ్రుతు లెరగని పాట సుతిని పాట.

8 ఇంటిదీపమమ్మ, కంటివెలుగు అమ్మ
దైవమంటె అమ్మ, ధరణిలోన
జోలపాడు ఎవరి, జోలిపట్టని అమ్మ
కరవు రాదు అమ్మ కరుణకెపుడు.

9 ఆకలైన వాని కన్నంబు పెట్టుట
మనుజ ధర్మమనుచు మరువకెపుడు
అన్న దానమునకు మిన్నదానము లేదు
భవ్య సుగుణశీల ! భరతబాల !

10 ధర్మగుణము వల్ల ధనికుడు శోభిల్లు
వినయమునను విద్య విభవమందు
మంచి గుణము వల్ల మనుజుడు శోభిల్లు
భవ్య సుగుణశీల ! భరతబాల !

# 3. పాటలు / గేయాలు

## 1. భారతదేశం కీర్తి

అందమైనదీ భారతదేశం
అందున ఉన్నది శుభ సందేశం
అమరగాయకుల గానవిశేషం
ఆత్మజ్ఞానుల అమృతకోశం
ఇది మన భారతదేశం
పవిత్ర భారతదేశం

1 ప్రపంచ మందున జ్ఞానజ్యోతులు
వెలుగక ముందే మనదేశం
ఖగోళ, జ్యోతిష్యశాస్త్రములందు
ఆరితేరినది మనదేశం
అణు సిద్ధాంతం ఆత్మతత్వముల
నందించినదీ మనదేశం
అన్నింటను తను అగ్రగామిగా
అవతరించినది మనదేశం... ॥ ఇది॥

2 శూన్యాంకంబును అందించిన
మన ఆర్యభట్టు ప్రభవించిన దేశం
గణితశాస్త్రమున వరాహమిహిరుని
జగతికిచ్చినది మనదేశం
శస్త్ర చికిత్సలో శుశ్రుతాఖ్యుని
పితామహునిగా నిలిపిన దేశం
చరకసంహితను మనకందించిన
చరకునిగన్నది మనదేశం ॥ ఇది॥

## 2. నాదేశం

నాదేశం భారతదేశం
భారతదేశం నాదేశం
ప్రపంచానికే ప్రప్రథమముగా
నాగరికత నేర్పించిన దేశం
విశ్వమంతటికి జ్ఞాన భిక్షను
ప్రసాదించినది నాదేశం || నాదేశం ||
పరస్త్రీలను మాతృభావమున
వీక్షించినదీ నాదేశం
శరణని వచ్చిన శత్రువునైనా
అక్కున జేర్చెడి నాదేశం || నాదేశం ||
మడం త్రిప్పుటే ఎరుగని వీరులు
అడుగడుగున ప్రభవిల్లినదేశం
త్యాగ ధర్మముల, సత్యాహింసల
నేర్పించినదీ నాదేశం || నాదేశం ||
వేదశాస్త్రములు, వేదాంతములు
వివరించినదీ - నాదేశం
దేవతలైనా భారతభూమిని
జన్మింపగ నెంచిన ఘనదేశం || నాదేశం ||
అనేకత్వమున ఏకత్వంబును
చూడగల్గినది నాదేశం
మానవ సేవయె మాధవసేవని
నిరూపించినది - నాదేశం || నాదేశం ||

## 3. ఇచ్చుట

ఇచ్చుటలో ఆనందమున్నదా?
పుచ్చుకొనుటలోనే వున్నదా?

కన్న తల్లినుండి నీవు ఏమి పుచ్చుకున్నావు?
నీతల్లికి తిరిగి నీవు ఏమిఇచ్చుచున్నావు !
కన్నతల్లి దైవంకన్నామిన్నరా !
తల్లికి నీవుసేవ చేసి ఋణము తీర్చరా !

నీ రూపానికి మూలం నీ తండ్రి తేజం
నీ కొరకర్పించుచుండు ఆయన సర్వస్వం
తల్లి దండ్రులకు నీవు తోడుండాలి
వారలను దైవాలుగా భావించాలి.

జ్ఞాన నేత్రమును తెరిపించును గురువు
నడవడికను నేర్పించి నడుపును గురువు
గురువు దైవమనుచు నీవు గుర్తుపెట్టుకో
గురువులను గౌరవించ నలవరచుకో

సమాజమున నీవు ఒక్క వ్యక్తివి గదరా !
సమాజమే లేకుంటే నీవు లేవుగదరా !
సమాజాన్ని దైవంగా నీవు భావించు
సమాజాభివృద్ధికి చెయ్యందించు.

## 4. దేశమె

దేశమె దేహం ధర్మమెప్రాణం.
ప్రతి పౌరుడు ఒక రక్త కణం.

మానవజగతిని మంచిని పెంచగ
దానవ జనముల వంచనత్రుంచగ
శరీరమొకటే సాధనము
శీలమె దానికి భూషణము ॥ దేశమె ॥

వెలుగుతోటను వెతికే బ్రతుకుల
వీర జీవనమె విధానము
ముళ్ళబాటలను ముందుకు సాగగ
తెలివితేటలే ప్రధానము ॥ దేశమె ॥

ఇనుప కండలు ఉక్కునరాలు
వజ్రతుల్యముగ హృదయాలు
నిర్మించే కృషి జరగాలి
నిరంతరం అది సాగాలి ॥ దేశమె ॥

హృదయాంతరంలో ధ్యేయ నిష్ఠయే
పరాత్పరంబై రగలాలి
తరం తరం అది వెలగాలి
ప్రగతి భారతికి కలగాలి ॥ దేశమె ॥

## 5. శాంతికి శంఖారావం

శాంతిని సంకల్పించే శంఖారావం.
సురసీమను తలపించే సంఘీభావం.
ఇదేఇదే నవభారత గీతాసారం.
కాంచిన కాంచన స్వప్నపు సాక్షాత్కారం.

దేశం ఏమిచ్చిందని దూషించుట దోషం
దేశానికి ఏమిస్తే తీరును ఋణశేషం
బ్రతుకిచ్చిందెవరు మెతుకిచ్చిందెవరు
ఆకాంక్షల కాధారము చూపించిందెవరు ॥ ఇదే ॥

కాలిగోరు గాయపడితె కంటనీరు తిరుగదా
వేరుచివర చీడపడితె చిగురునేల కొరగదా
ప్రాంతం ఏదైనా భాషలు ఎన్నైనా
దేశమంత ఒక్క దేహమన్న స్పర్శపోవునా ॥ ఇదే ॥

## 6. ఈ పుడమి

ఈపుడమి నాతల్లి నేనామె పుత్రుడను
నాతల్లి వైభవము ఎలుగెత్తి చాటెదను
నాధర్మజ్యోతి నలువైపులా చూపెదను ॥ ఈ పుడమి ॥

ఉత్తుంగ హిమశృంగ ఔన్నత్వమది నాది
హిందు సంద్రమె నాదు గాంభీర్య చిహ్నంబు
పావన జాహ్నవీ సమమె నా జీవితము
ఈనేల అణువణువు తెలుపు నా సచ్చరిత ॥ ఈ పుడమి ॥

భావ దాస్యము నాకు ఏకోశమున లేదు
ప్రతి రక్తనాళమున ప్రవహించు శౌర్యమే
అపజయాశంక నా సంప్రదాయమె కాదు
వెనుకంజయే లేదు విజయమే నా సొత్తు ॥ ఈ పుడమి ॥

## 7. చేయి చేయి

చేయి చేయి కలుపుదాం సేవచేయ కదలుదాం
ప్రజల కొరకె సంఘముగా ప్రతి నిమిషం బ్రతుకుదాం ॥ చేయి చేయి ॥

1 అవయవాలు వేరైనా ఆత్మమాత్రమొక్కటే
ప్రాంతం పేరేదైనా ప్రజలంతా ఒకటే
భాషలెన్ని పలికినా భావ సంపదొక్కటే
ప్రమాదాలు ఎదురైతే ప్రతిస్పందనమొక్కటే ॥ చేయి చేయి ॥

2 కంటి నలుసు కాలిముల్లు కలిగించే బాధలను
గుండె రగుల మెదడు కదలకరములు తొలగించురా
భరతభూమినేసీమను బాధలు పెల్లుబికినా
మన కండలు కరిగించి ఇడుములు తొలగించుదాం ॥ చేయి చేయి ॥

3 జనశక్తిని జాతికొరకు జాగృత మొనరించుదాం
ఒకే తల్లి బిడ్డలమను ఊహనిచట పెంచుదాం
వందేమాతర మంటూ ముందు ముందుకేగుదాం
ఒకరికొకరు తోడు నిలిచి ఉన్నతి సాధించుదాం ॥ చేయి చేయి ॥

## 8. వందనమమ్మ

తల్లీ భారతీ – వందనమమ్మా
నీ ఇల్లే మా నందనమమ్మా
బాల బాలికల మందరము – నీ
నందన వనిలో మల్లెల మమ్మా

చదువులు బాగా చదివెదమమ్మ
జాతి గౌరవం పెంచెదమమ్మా
తల్లిదండ్రులను గురువులను
ఎల్లవేళలా కొలిచెదమమ్మా ॥ తల్లీ ॥

గాంధీ నెహ్రూ బోధనలను
అందర మొకటై ఆచరింతుము
భారతదేశ సమైక్యత కోసం
బాలల మంత శ్రమించెదము ॥ తల్లీ ॥

కులమత భేదం మరిచెదము
కలతలు మాని చరించెదము
మానవులంతా సమానులంటూ
మమతను సమతను పెంచెదము ॥ తల్లీ ॥

ఆంధ్ర జాతికి అభ్యుదయం
నవభారతికి నవోదయం
భారత జనులకు జయం జయం
భావి పౌరులం మనం మనం ॥ తల్లీ ॥

– దాశరథి

## 9. సుశ్యామల మనతల్లి స్వర్ణ భారతి

సుశ్యామల మన తల్లీ స్వర్ణ భారతి
రత్నగర్భ మన తల్లి రమ్య భారతి
వేదాలను వెలయించిన విజ్ఞానసినీ
విశ్వ శాంతి కోరే విశాల హృదయినీ ॥ సుశ్యామల ॥

1) ఉన్నతమౌ హిమగిరులూ – ఉత్కృష్టపుజీవనదులు
సస్యశ్యామల చేలూ – చల్లని పవనములు
ఎల్లవేళలా కలిగిన చల్లని తల్లీ
ఎదురు లేని వీర భూమి మన కల్పవల్లీ ॥ సుశ్యామల ॥

2) దిగంతాల తన కీర్తినె దేదీప్యమానంగా
వెలయించిన వీరులను కన్నతల్లీ
వసుధైక కుటుంబమన్న వాదనతో
సమతా, మమతా, మానవతా చాటిన తల్లీ
సాటిలేని కర్మభూమి మన కల్పవల్లీ ॥ సుశ్యామల ॥

# 10. పువ్వులా నవ్వుకో

పువ్వు వంటి మనసుతో
నవ్వుతో హాయిగా
వలపు చిలికి పదిమందిని
పలకరించు తీయగా

విరులవోలె నీవు కూడ
పరులకుపకరించ వోయ్ ।
పరుల కుపకరించి నపుడె
బ్రతుకు పరిమళించునోయ్ ॥

మనిషి మనిషికీ దేవుడు
మనసిచ్చాడు
మనుషులుగా బ్రతకండని
మమతిచ్చాడు ।

మమతలు పండించుకొన్న
మనసుకోవెల ।
మంచితనం చంపుకొన్న
మనసు పెనుశిల ।

మనసులోన దేవుడున్న
మాట మరువకు
మంచి మనిషి దేవుడన్న
మాట మరువకు ।

– వక్కలంక లక్ష్మీపతిరావు.

# 4. కథలు

## 1. మేకపోతు గాంభీర్యం

ఒకానొకప్పుడు ఒక మేకల కాపరి ఉండేవాడు. అతనికి చాలా మేకలు ఉన్నాయి. మేతకోసమని ఆ మేకలమందను ప్రతిరోజూ అడవికి తోలుకెళ్తూ ఉండేవాడు. ఒకనాడొక మేకపోతు మందనుండి తప్పించుకొనిపోయింది. ఆ విషయం అతడు గమనించలేదు.

రాత్రయింది, దానికి దారి తెలియలేదు. అటూయిటూ తిరగగా చివరికి ఒక కొండగుహ కనిపించింది. లోపలికి పోయి పడుకున్నది. ఆ గుహలో నివసించే సింహం కొంతసేపటికి తన నివాసస్థలానికి వచ్చింది.

తన గుహలోపడుకొని వున్న మరో జంతువును సింహం చూసింది. చీకట్లో మేకపోతు కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. పెద్ద గడ్డమూ, వాడిగా ఉన్న కొమ్ములూ ఉన్న ఆ వింత జంతువును చూడగానే సింహానికి భయం వేసింది. అలాంటి వింతజంతువును సింహం ముందెన్నడూ చూసి ఉండలేదు. ఏమి చేయాలో తోచక, సింహం అలాగే గుహ ముంగిట నిలబడింది.

మేకపోతుకు కూడా సింహాన్ని చూడగానే గుండెల్లో గుబలు మొదలైంది. భయాన్ని బయటకు కన్పించనీకుండా ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకొని మేకపోతు అలాగే పడుకొన్నది. సింహం బారినుండి బయటపడి ప్రాణాలు దక్కించుకోవడం ఎలాగా? అని ఆలోచిస్తూ తెల్లవారుతుండగా, బయటకు వచ్చిందిమేకపోతు, సింహం జంకును కనిపెట్టిన మేకపోతు, “నీవెవరవు? అని గద్దించింది. “నేను సింహాన్ని .... మృగరాజుని...” అని బిడియపడుతూ చెప్పి, తమరెవరు? అని భయం భయంగా తడబడుతూ అడిగింది సింహం.

“ఓహెూ ..... నీవేనా సింహానివి... మృగరాజువా? నా అదృష్టం పండింది.....వేయి ఏనుగులనూ, నూటికిపైగా పులులనూ నేను ఇప్పటివరకూ చంపాను తెలుసా? సింహాన్ని చంపేవరకూ...... ఈ గడ్డం తీయనని ప్రతిజ్ఞ చేశాను. ఈనాటితో నా దీక్షపూర్తైనట్లే...... ఇప్పుడు నిన్ను చంపి నా గడ్డం పీడ వదిలించుకొంటాను.....” అంటూ తలను మోరగించి గంభీరంగా మేకపోతు ముందుకాళ్ళు రెండూ పైకెత్తి ఒక్క దూకు దూకింది. అదిచూచిన సింహం హడలిపోయి పరుగు లంకించుకొంది.

బ్రతుకు జీవుడా అనుకొని ఆ మేకపోతు అక్కడి నుండి వెళ్ళి, తర్వాత అడవికి వచ్చిన మేకల మందలో కల్సి సాయంకాలానికి ఇంటికి చేరింది.

డాబు – దంబం రాయుళ్ళు ఒట్టి దర్పాన్ని ప్రదర్శించినపుడు అంతా డాబేనని అనడానికి ఈ పలుకుబడిని తరచూ ఉపయోగిస్తూ ఉంటాం.

(శ్రీ పర్వతనేని గంగాధరరావుగారి రచన)

## 2. కొంగ – ఎండ్రి

బదరికా వనంలో ఓ పెద్ద సరస్సు ఉండేది. రకరకాల జలచరాలు ఆ సరస్సులో సుఖంగా సహవాసం చేస్తూండేవి. అక్కడే ఓ కొంగ కూడా కాలక్షేపం చేసేది. దానికి వయస్సు పైబడింది. సునాయాసంగా చేపల్ని ముక్కున కరచి మెక్కే శక్తి సన్నగిల్లింది. ఆహారం తక్కువయింది. ఆకలి ఎక్కువయింది. శక్తి ఉడిగిపోయింది. కాబట్టి యుక్తిని నమ్ముకుంటే తప్ప ఆకలి నుంచి విముక్తి లేదన్న ఆలోచన కలిగింది.

ఒకరోజు ఆ కొంగ, సరసు అంచుమీద నిలబడి పెద్దగా రోదిస్తూ, బొటబొట కన్నీళ్ళు కారుస్తోంది. ఓ ఎండ్రిక మిత్రులైన మీన సమేతంగా వచ్చి కొంగపైన సానుభూతి కురిపిస్తూ, "బాబాయ్, కుశలమేనా? చాలా కాలంగా నిన్నెరుగుదుము. ఎప్పుడూ నిర్విచారంగా ఉండేవాడివి. అలాంటి నీవు కంట నీరు పెట్టుకోవడానికి కారణమేమిటి? ఆ నిట్టూర్పులేమిటి?" అనడిగింది.

ఆ టక్కరి కొక్కెర దుఃఖం పొర్లుతున్న గొంతుతో, "బిడ్డా, సంసార బంధాలను పరిత్యజించి సన్యసించదల్చుకున్నాను. ఇప్పటిదాకా తప్పో ఒప్పో దొరికిన చేపల్ని భుజించి ఆకలి బాధ తీర్చుకున్నాను. ఇకపై ప్రాణాలు పోయినా సరే నా బిడ్డల్లాంటి చేపల్ని ఆహారంగా తీసుకోను. నేటి నుంచి ఆమరణ నిరాహార దీక్ష పూనాను" అన్నది.

"బాబాయ్, నీ నిరాహారదీక్షకు కారణమేమిటి?" అనడిగింది ఎండ్రి.

"మీకొక ఆపద రానున్నదని నా మనస్సు తల్లడిల్లిపోతున్నది. ఈ చెరువు ప్రక్కనుండి నగరం వైపుగా నడుస్తూ జాలర్లు కొందరు చెప్పుకుంటూ పోతున్న మాటలు నా చెవిన పడ్డాయి. 'ఇది చాలా పెద్ద చెరువు. నిండా చేపలు. వలవేస్తే వల్లమాలినన్ని చేపలు. ఇంకా కొంత నీరెండేదాకా ఆగుదాం. తరువాత మన అదృష్టమే అదృష్టం'. ఈ మాటలకు నా గుండెలు బద్దలయ్యాయి. నాకు ఆకలి నశించింది. ఆహారం మీద ధ్యాస లేదు" అంటూ కల్లబొల్లి మాటలతో చెరువులోని సమస్త జలచరాల గుండెల్లో అల్లకల్లోలం లేపింది.

"అయ్యయ్యో, చిన్నయ్యో, అన్నాయ్యా, ఆప్తమిత్రమా, ఉపాయశాలీ, శరణు శరణు! విరుచుకుపడబోతున్న విపత్తును విన్నవాడివి నువ్వే కాబట్టి విరుగుడూ నువ్వే చెప్పాలి. ప్రాణాపాయం నుంచి మమ్మల్ని కాపాడు!" అని ఎండ్రి, చేపలు, ఇతర జలచరాలు వేడుకొన్నాయి.

బకం కొంచెం సేపు ఆలోచిస్తున్నట్లుగా నటించి, "నేనా పక్షిని, మనుషులతో పోటీపడి నెగ్గుకు రాలేను. రెక్కలున్నాయి కాబట్టి ఒక్క మేలు చేయగలను. మిమ్మల్ని ఈ చెరువు నుంచి ఎప్పటికీ ఎండని నిండు చెరువుకు మార్చగలను" అని నమ్మించింది.

ముందుగా మమ్మల్ని, ముందుగా మమ్మల్ని అంటూ చేపలు దొంగమాటల కొంగమీదకి తోసుకొచ్చాయి.

"ఆగండి, ఆగండి! అందర్నీ ఒక్కరోజులో అక్కడ దింపి వచ్చేటంత సత్తువ ఉన్నవాణ్ణి కాదు. సాధ్యమైన మేరకు దినదినం మిమ్మల్ని దింపేసి వస్తాను" అని పైకి నమ్మబలికింది కొంగ.

అది మొదలు ప్రతిరోజూ ముక్కున కరుచుకుని పోగలిగినన్ని చేపల్ని కొంగబాబాయి మోసుకెళ్ళి అక్కడికి కొంత దూరంలో ఉన్న కొండ బండమీద పెట్టుకుని నిక్షేపంగా భక్షింపసాగింది. కొద్ది రోజులకల్లా కొలను దాదాపుగా ఖాళీ అయిపోయింది. ఎండ్రి మిగిలిపోయింది. "బాబాయ్, చేపలన్నిటినీ అపాయం నుంచి కాపాడావు. అలాగే నా మీదా దయచూపవా?" అని వేడుకొంది ఎండ్రి.

"రోజూ వచ్చి చేపలు తినీ తినీ వెగటు పుట్టింది. ఎండ్రకాయ తింటే కొత్తరకంగానూ, కొత్త రుచి చూసినట్లుగానూ ఉంటుంది, భేష్!' అని మనస్సులో అనుకునొ లొట్టలు వేసింది.

కొంగ ఎండ్రిని ముక్కున కరచుకొని కొండ వైపు ఎగిరిపోతూనే ఉంది. ఎండ్రికి అనుమానం వచ్చింది. 'ఎన్నటికీ ఎండని నిండు చెరువని చెప్పాడు కొంగబాబాయి. ఈ ప్రాంతంలో ఎక్కడా నీళ్ళే లేవని మిత్రులు చెప్పగా విన్నాను. ఇందులో ఏదో మోసం ఉంది' అనుకుని, "నువ్వు చెప్పిన చెరువెక్కడ బాబాయ్?" అనడిగింది ఎండ్రి.

కొంగ నవ్వి, "ఓసి పిచ్చిదానా, ఆ కండవార బండరాయిని చూడు, నీ మిత్రులందర్నీ హాయిగా భోంచేశాను. అది మధ్యశిల. తెలిసిందా? ఇప్పుడు నీవంతు వచ్చింది" అని చెప్పింది.

ఎండ్రి కిందికి చూసింది. కొంగ చెప్పిన మధ్యశిలమీద అది తినిపారేయగా మిగిలిన చేపల ముళ్ళు, తోకలు, తలభాగాలు గుట్టలుగా పడున్నాయి. రాగల ప్రమాదం గుర్తించిన ఎండ్రి చప్పున తన నాలుగు గిట్టలతో కొంగ మెడను కటుక్కున కొరికి త్రెంచివేసింది. కొంగ గిలగిల కొట్టుకుని నేలకూలింది. బ్రతుకుజీవుడా అని ఎండ్రి సమయస్ఫూర్తితో ప్రాణాలు దక్కించుకుని చెరువుకు మరలి వచ్చింది.

## 3. యుధిష్ఠరుని విద్యాభ్యాసం

కౌరవ పాండవులు ద్రోణాచార్యుని వద్ద విద్యను అభ్యసించేవారు. నీతి, ధర్మములను గురించిన పాఠ్యాంశమును గురువు బోధిస్తున్నాడు. ద్రోణుడు తన శిష్యులకు మూడు వాక్యములు చెప్పి, వాటిని కంఠస్థం చేయమని చెప్పాడు. అవి 'సత్యము పలుకుము', 'ధర్మము నాచరింపుము'. 'క్రోధము చెందవద్దు' అనేవి.

పిల్లలంతా ఆ వాక్యాలను కొద్దిసేపటికే కంఠస్థం చేసి గురువుకి అప్పగించారు. యుధిష్ఠరుని వంతు వచ్చింది. అతను వినయంగా లేచి నిలబడి "ఆచార్యా! నాకు ఇప్పటికి రెండువాక్యాలే అలవడ్డాయి. అవగతమైనాయి. ఇంకా మూడవ వాక్యం రావాలి" అన్నాడు.

దాంతో ద్రోణుడుకోపించగా "ఆచార్యా ! ఇంకా నాకు కొంత సమయం కావాలి" మూడవవాక్యాన్ని మీకు నేను రేపు అప్పచెబుతాను" అన్నాడు ధర్మరాజు. సరేనన్నాడు గురువు. మర్నాడు కూడా యుధిష్ఠరుడు ఆ వాక్యాన్ని అప్పగించలేదు. దాంతో ద్రోణుడు అతనిని దండించాడు. "జ్యేష్ఠపుత్రుడవైయుండి కూడా నీకింత మందబుద్ధా! సరళమైన చిన్నవాక్యాన్ని కూడా కంఠస్థం చెయ్యలేకపోయావా! ఇంతకీ నీకు రాని వాక్యమేదో చెప్పు" అన్నారు.

గురుదేవా! ధర్మాన్ని ఆచరించే శక్తి నాకింకా రాలేదు. నేను మీతో సత్యమును చెప్పాను. మీరు నన్ను దండించినా నేను క్రోధాన్ని పొందలేదు. కాబట్టి సత్యసంధత, క్రోధమును విడుచుట అనే రెండు వాక్యాలు నా జీవితంలో భాగమైపోయాయని విశ్వాసం ఏర్పడింది" అన్నాడు ధర్మరాజు. ఆ మాటలు విన్నాక ద్రోణుని నేత్రాల నుండి అశ్రువులు రాలాయి. "యుధిష్ఠరా! నీవు నిజమైన శిష్యుడవు. నా నేత్రాలు తెరిపించావు. కంఠస్థం చెయ్యడం అంటే దానర్థం వల్లె వేయడం కాదని, దానిని జీవితంలో అమలు జరపడమని, ఆచరణలో పెట్టడమని నిరూపించావు" అంటూ అభినందించారు గురువు.

## 4. దొంగ సన్యాసి

ఒక ఉద్యానవనంలోని కుటీరంలో ఒక గుడ్డి సాధువు నివసించేవాడు. ప్రజలు ఆయనను ఎంతో గౌరవించేవారు. ఆయనకు అతీత శక్తులున్నాయని నమ్మేవారు. అతడు ఎన్నో అద్భుతాల్ని చేసి చూపేవాడు. గాలిలోంచి డబ్బు తెప్పించేవాడు. మందుల్ని రోగులకు ఇస్తుండేవాడు. ప్రతిరోజు చాలా మంది ప్రజలు ఆయన ఆశీస్సుల కోసం ఆయన దగ్గరకు వెళ్ళేవారు వారి ఇబ్బందుల్ని కష్టాల్ని తొలగించమని ప్రార్థించేవాళ్ళు.

ఒకరోజున ఒక అమ్మాయిని ఆయన వద్దకు తీసుకెళ్ళారు. ఆ అమ్మాయి మాట పడిపోయింది. మూడు నెలల క్రితం ఒక బందిపోటు దొంగ ఆ అమ్మాయి కళ్ళ ఎదుటే ఆ పాప తల్లిదండ్రులను చంపి, ఇంట్లోని డబ్బునంతటినీ ఎత్తికెళ్ళిపోయాడు. ఆ అమ్మాయి ఆ ఘాతుకాన్ని చూసిన వెంటనే మాట పడిపోయింది.

ఇప్పుడు ఆ సాధువును చూసిన వెంటనే ఆ అమ్మాయికి మాట వచ్చేసి గట్టిగా "ఆయనే ఆ బందిపోటు దొంగ అతడే మా తల్లిదండ్రులను చంపేశాడు. మా ఆస్తిని కాజేశాడు" అని అరచింది.

ఆమె చుట్టు ఉన్నవారు ఆ మాటలు నమ్మలేదు. ఆ సాధువు శక్తివల్లే ఆ అమ్మాయి మాట్లాడగలిగిందని వాళ్ళు భావించారు. పైగా ఆ పిల్లకు పిచ్చెక్కిందని అన్నారు.

ఆ సాధువు ఆ పిల్లని తరువాత కొన్నాళ్ళకు తీసుకురమ్మని ఆ పిల్ల మామయ్యకు చెప్పాడు. కాని ఆ అమ్మాయి ఆ సాధువే దొంగ అని అరుస్తూనే ఉంది. ఆ పిల్ల మామయ్య మాత్రం ఆశ్రమం నుంచి పిల్లను లాక్కెళ్ళిపోయాడు.

వాళ్ళు ఆశ్రమం బైటకు వచ్చిన వెంటనే ఒక పెద్దాయన అక్కడకు వచ్చాడు "ఆ అమ్మాయికి జబ్బేమి లేదు. నేనొక డాక్టరుని. ఆ అమ్మాయి చెప్పేది నిజమే. ఆ సాధువు మోసగాడు. అతడికి అతీతశక్తులేవీ లేవు. నన్ను రాజా బీర్బల్‌గారు పంపించారు. ఆ సాధువు వేషాలు బైట పెడ్తాను. ఇప్పుడు మనకు ఒక రుజువు దొరికింది. ఈ పిల్లను బీర్బల్ దగ్గరకు తీసుకెళదాం" అని ఆ పిల్ల మామయ్యతో చెప్పాడు. వెంటనే ఆ పిల్లను బీర్బల్ వద్దకు తీసుకెళ్ళారు.

బీర్బల్ ఆ పిల్లను అక్బరు ఆస్థానానికి తీసికెళ్ళి అక్బరుకు కథనంతటిని చెప్పాడు. "నీవు గనక ఆ సాధువు గుడ్డివాడు కాదని నిరూపిస్తే అతడికి తగిన శాస్తి చేస్తాను" అని అక్బరు బీర్బల్‌కు చెప్పాడు.

మరుసటి రోజు ఆ సాధువును అక్బరు ఆస్థానానికి తీసుకువచ్చారు. బీర్బల్ ఆ సాధువు మోసాన్ని బయట పెట్టేందుకు ఒక పథకం ఆలోచించి పెట్టుకున్నాడు. ఆ సాధువును అక్బరు ముందు నిలబెట్టిన వెంటనే బీర్బల్ గట్టిగా అరుస్తూ తన

ఖడ్గాన్ని చేతబట్టి ఆ సాధువు మీదికి లంఘించాడు. ఆ సాధువు తన పక్క నిలబడ్డ సైనికుడి కత్తిని లాక్కొని బీర్బల్‌ను ఎదిరించేందుకు సిద్ధపడ్డాడు. ఆ సాధువు గుడ్డివాడు కాదని తెలిసిపోయింది. ఆ పాపచెప్పింది నిజమని తేలింది. వెంటనే అతడి ఆశ్రమాన్ని సైనికులు వెదికితే ఎన్నో బంగారు నాణాలు, ఆభరణాలు, ఇతరత్రా వస్తువులు దొరికాయి. ఆ సాధువును ఉరితీశారు.

## 5. రంతిదేవుడు

రంతిదేవుడు ఒక రాజు. తనకు ప్రాప్తమయిన ధనాన్ని ఆయన దానం చేస్తూ అందరికీ సహాయపడుతూ తృప్తిచెందేవాడు. ఒకసారి కరువు వచ్చింది. వర్షాలు కురవక, పంటలు పండక ప్రజలు అల్లాడిపోయారు. ఆ సమయంలో రంతిదేవుడు విరివిగా అన్నదానాలు చేయసాగాడు. ఆయనకు తినడానికి తిండి కూడా లేని స్థితి దాపురించింది. ఒకసారి 48 రోజులు అన్నం లేని పరిస్థితి ఎదురైంది. ప్రాణాలుపోయే స్థితి వచ్చింది. ఒకనాడు అతనికి కొద్దిగా ఆహారం లభించింది. దాన్ని తినబోయే సమయంలో ఒక బ్రాహ్మణుడు ఆకలితో వచ్చాడు. రంతిదేవుడు అతనికి తన ఆహారంలో కొంత అందించాడు. అంతలో మరొక వ్యక్తి వచ్చాడు. అతనిలో కూడా పరమేశ్వరుని రూపాన్ని చూసి మరికొంత భాగం ఇచ్చివేశాడు. అంతలో కుక్కలను వెంటబెట్టుకొని ఒక ఛండాలుడు వచ్చాడు. ఆకలి బాధను తీర్చమన్నాడు. రంతిదేవుడు మిగిలిన ఆహారాన్ని అతనికిచ్చివేసి, మిగిలిన నీటిని త్రాగబోయాడు. అదేసమయంలో ఒక ముసలి కుక్క వచ్చి దీనంగా అరిచింది. రంతిదేవుడు ఆ ద్రవాన్ని కూడా కుక్కకుపోసి సంతృప్తి చెందాడు. ఇదది రంతిదేవుని దానగుణాన్నే కాకుండా అతని నిస్వార్థతను కూడా చాటుతున్నది.

## 6. మాతృభాష ఏది?

ఒకసారి బహుభాషా పండితుడు ఒకరు అక్బర్ ఆస్థానానికి వచ్చాడు. అతడు అనేక భాషలలో నిష్ణాతుడు సభలోని వారందరితో వివిధ భాషలలో మాట్లాడాడు. ఎవరు ఏ భాషలో ప్రశ్నిస్తే వారికి ఆ భాషలోనే సమాధానాలు చెప్పాడు. మొత్తం సభ అంతా అతని భాషా పరిజ్ఞానానికి అచ్చెరువొందింది. చక్రవర్తి అతనికి విలువైన కానుకలు సమర్పించాడు.

“మహారాజా ! నేను మీ సభాసదులకు ఒక సవాల్ విసరదలచాను. నా మాతృభాష ఏదో మీరు గుర్తించి చెప్పగలగాలి. అలా చెప్పలేకపోతే మీ రాజ్యంలో నా అంత తెలివైన వారు లేరని అంగీకరించాలి అన్నాడు అక్బర్. ఆ సవాలును స్వీకరించాడు. “మీరు మా అతిధి. ఇవాల్టికి విశ్రాంతి తీసుకోండి రేపు సభలో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పబడుతుంది.” అని చెప్పి ఆ పండితుడిని అతిథి గృహానికి పంపించాడు. ఆ తర్వాత తన దర్బార్‌లోని మంత్రులను అతని మాతృభాష ఏదో గుర్తించగలరా?” అని ప్రశ్నించాడు.

మంత్రులంతా తలలు వాల్చారు. అక్బర్, బీర్బల్‌వైపు తిరిగి “బీర్బల్ నువ్వే మన పరువు కాపాడాలి. నువ్వు ఈ సమస్యకు పరిష్కారం సాధించగలవు” అన్నాడు.

"సరే మహారాజా! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను" అని అభయం ఇచ్చాడు బీర్బల్.

ఆ రాత్రి బీర్బల్ నెమ్మదిగా ఆ పండితుడు ప్రవేశిస్తున్న గదిలో ప్రవేశించాడు. ఒక గడ్డిపోచ తీసుకుని అతని చెవిలో గిలిగింతలు పెట్టాడు. ఆ పండితుడు నిద్రలో విసుగ్గా అటు తిరిగాడు. రెండవ చెవిలో గడ్డిపోచతో గిలిగింతలు పెట్టాడు. ఆ పండితుడు నిద్రమత్తులో "ఎవరది?" అన్నాడు తన మాతృభాషలో, బీర్బల్‌కు సమాధానం దొరికింది ఆ గది నుండి నెమ్మదిగా బయటకు వచ్చాడు.

తెల్లవారి దర్బారులో సభాసదులంతా బీర్బల్ ఏం చెబుతాడా అని ఎదురు చూడసాగారు. బీర్బల్ ఆ పండితునితో అనేక బాషల్లో మాట్లాడి అతనికే కాదు తనకూ అన్ని భాషలు వచ్చని నిరూపించాడు. తర్వాత ఆ పండితుని మాతృభాష తెలుగు అని తేల్చాడు. ఆ పండితుడు అందుకు అంగీకరించి చక్రవర్తి తనకు ఇచ్చిన కానుకలను బీర్బల్‌కు ఇచ్చాడు. ఓటమి భారంతో సభనుండి నిష్క్రమించాడు.

అప్పుడు అక్బర్, బీర్బల్‌ని "అతని మాతృభాష ఎలా కనిపెట్టగలిగావు?" అని ప్రశ్నించాడు.

"ప్రభూ! ఏ మనిషి అయినా ఎన్ని భాషలు మాట్లాడినా అతనికి ఇబ్బంది కలిగినప్పుడు తప్పకుండా తన మాతృభాషలోనే మాట్లాడతాడు. నేను అతనికి నిద్రాభంగం కలిగించినప్పుడు తెలుగులో మాట్లాడాడు. దాని ద్వారా అతని మాతృభాష తెలుగు అని గుర్తించగలిగాను" అని విడమర్చి చెప్పాడు బీర్బల్.

బీర్బల్ తెలివికి మెచ్చిన అక్బర్ అతనికి అనేక కానుకలు సమర్పించాడు.

## 7. ఏకలవ్యుడు – గురుభక్తి

పూర్వము హిరణ్యధన్యుడు అను ఎరుకల రాజు ఉండేవాడు. అతని కుమారుడు పేరు ఏకలవ్యుడు. చిన్నప్పటి నుండి ఏకలవ్యునికి విలువిద్య నేర్చుకోవాలనే కోరిక ఉండేది. ద్రోణాచార్యుల వద్ద విలువిద్య నేర్చుకోవాలని ఏకలవ్యుడు బయలుదేరాడు.

ఏకలవ్యుడు ద్రోణుని వద్దకు వెళ్ళి "అయ్యా! నాకు ధనుర్విద్య నేర్పండి" అని ప్రార్థించాడు. ద్రోణాచార్యుడు "నాయనా! నీవు పామరుడవు. నీకు ధనుర్వేదము నేర్పను" అని అన్నాడు. చేసేది లేక ఏకలవ్యుడు తన గూడెం తిరిగి వచ్చాడు.

ఏకలవ్యుని ఆకాంక్ష మరుగున పడలేదు. అడవిలో స్వయముగా అభ్యాసము మొదలెపెట్టాడు. ద్రోణుని విగ్రహం తయారుచేసి గురుస్థానంలో ఉంచి పూజించసాగాడు. ఒకే ధ్యాసతో, నిష్ఠతో విద్యాభ్యాసము చేసి ఆ విద్యలో గొప్ప నేర్పును సంపాదించాడు.

ఒకసారి ద్రోణాచార్యుని శిష్యులైన కౌరవపాండవులు అడవికి వెళ్ళారు. వెంట వేటకుక్కలు కూడా ఉన్నాయి. ఒక కుక్క ఏకలవ్యుడు ఉండే చోటికి వెళ్ళి, మొరగసాగింది. ఆ ధ్వని ఏకలవ్యునికి ధ్యానభంగం కలిగించింది.. ఒకేసారి ఏడు బాణాలు వదలి చెట్టుచాటున ఉన్న కుక్క మూతిని కుట్టేశాడు. ఆ కుక్క బాధతో తన యజమానుల వద్దకు వెళ్ళింది.

అద్భుతమైన ఆ బాణ ప్రయోగ విధానానికి అబ్బురపడి, ద్రోణాచార్యుని శిష్యులు ఏకలవ్యుని వద్దకు చేరారు. వారు ఆయను నీ గురువు ఎవరు? అని ప్రశ్నించారు. ద్రోణాచార్యులని ఏకలవ్యుడు చెప్పాడు.

అర్జునుని మించిన విలుకాడు ఉండబోడని ఒకప్పుడు ద్రోణాచార్యుడు చెప్పాడు. అర్జునుడు ఏకలవ్యుని చూసి ఈర్ష్యచెందాడు. తన కంటే గొప్ప విలుకానుని ద్రోణుడెందుకు చేశాడో తెలుసుకొనదలిచాడు. ద్రోణుని చేరి జరిగిందంతా తెలియజేశాడు.

ద్రోణాచార్యుడు శిష్యులతో ఏకలవ్యుని చేరవచ్చాడు. తనను ఆరాధిస్తూ గురువుగా భావించి, అమిత నిష్ఠతో విద్యాభ్యాసం చేస్తున్న ఆ నిషాద బాలుని భక్తినిష్ఠలకు ఆనందాన్ని పొందాడు. ఏకలవ్యుని మేటి విలుకాడని గుర్తించాడు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గురుదక్షిణ కోరాడు.

గురుదక్షిణ కోరిన ద్రోణునితో "నాకు పుట్టుక నిచ్చిన తల్లిదండ్రులు, విద్యనిచ్చిన గురువు, సమాన పూజనీయులు. కనుక ఈ శరీరము గాని, నా సంపదలు గాని ఏది కోరినా సమర్పించటానికి సిద్ధముగా ఉన్నాను. శరీరము కోసి ఇచ్చిన గురువు ఋణము తీరదు కదా" అన్నాడు. ద్రోణుడు కుడి చేతి బొటనవ్రేలును దక్షిణగా కోరాడు. ఏకలవ్యుడు పరమానందంతో ముందు వెనుకలు ఆలోచించకుండా బొటనవ్రేలును కోసి గురువు పాదాల చెంత ఉంచాడు. ఏకలవ్యుని గురుభక్తి తరతరాలకు అనుసరించదగిన ఆదర్శంగా నిలిచింది.

## 8. దుఃఖం లేని వాని చొక్కా

ఒక రాజుగారికి నిద్రపట్టలేదు. ఒళ్ళంతా కంపరమెత్తుతోంది. బైట వెన్నెల, చల్లని గాలి, శీతల పానీయాలు, మృదు మధుర సంగీతం. ఇవేవీ రాజుగారికి నిద్ర తెప్పించలేదు.

మంత్రిగారికి కబురు వెళ్ళింది. సమస్యను విన్నాడు. మంత్రి ఒక్క క్షణం ఆలోచించాడు. "మహాప్రభూ! మన రాజ్యంలో సుఖంగా ఉన్నవాడి చొక్కా కాసేపు ధరించండి. నిద్ర ముంచుకు వస్తుంది" అన్నాడు.

రాజు గారికి ఇదీ బాగుందనిపించింది. తన రాజ్యంలో అందరూ సుఖంగానే ఉన్నారు గదా! అని మారువేషంలో బైలుదేరాడు. ఎక్కడ చూచినా గుర్రుపెట్టి నిద్రపోయే వాడే కనిపించలేదు. డబ్బు కోసం తగాదా, ఆస్తి కోసం కలహం, భోగాల కోసం ఏడుపు.

రాజుగారు పేదవారి ఇళ్ళవైపు వెళ్ళాడు. ఇంటికి తలుపుల్లేవు. అక్కడ ఒకడు బయట రాత్రి తిన్నెమీద ఆదమరచి నిద్రపోతున్నాడు. రాజుగారికి చాలా సంతోషం కలిగింది. తాను వచ్చిన పని నెరవేరినట్లే వాణ్ని నిద్రలేపటం చొక్కా అడగటం తరువాయి.

అదో పెద్ద సమస్య అయింది. మెల్లగా లేపాలనుకొన్నాడు. కుదరలేదు. తట్టి లేపటం ఇష్టంలేదు. తాను సంగీతం పాడగలడు. తనకు నిద్ర పట్టటానికి సంగీతం పాడుతారు. వీణ్ణి నిద్రలేపడానికి ఆ సంగీతం ఉపయోగిస్తుందా? ప్రయత్నించి

చూశాడు. రాజు తన్మయుడై పాడుతున్నాడు. వాడు నిద్రలేని పాడేవాణ్ణి చూసి ఎవరో పరదేశి అనుకున్నాడు. 'బాబూ బువ్వ తింటావా?' అన్నాడు పేదవాడు.

రాజు గారికి తిరిగి తిరిగి, పాడి పాడి ఆకలైంది. అవునన్నాడు. రాజును పేదవాడు గుడిసెలోకి తీసుకుపోయాడు. రేపటికి దాచుకొన్న రొట్టెలు పరదేశికి పెట్టేశాడు. రాజు రేపె నీకో? అన్నాడు 'రేపు రానీ, నీకు నాకు సరిపడ సంపాదిస్తా కడుపు నిండిందో లేదో! ఈ రాత్రికి నిద్రపో!" అన్నాడు.

రాజు చాలా సంతోషించాడు. "బాబూ చలిగా ఉంది, నీ చొక్కా ఇస్తావా" అన్నాడు. పేదవాడు "అయ్యా! నాకు చొక్కాలేదు" అన్నాడు. కావున సుఖం – ధనం, ధాన్యం, సంపాదన మున్నగువాని యందులేదు. ఏ చీకూ చింత లేకపోడమే సుఖం.

## 9. ఆటలతో ఆరోగ్యం

సీతాపురంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణ అంతా కళకళలాడుతూ ఉంది. ఆరోజు ఆ పాఠశాల వార్షికోత్సవం. అందుచేత రంగురంగుల జెండాల తోరణాలు, విద్యుత్ బల్బుల వెలుగులు, వివిధరకాల అలంకరణతో కనులపండుగగా ఉంది ఆ పాఠశాల. అక్కడ అందరి ముఖాల్లో ఆనందం తొంగి చూస్తోంది. బహుమతి ప్రధానకార్యక్రమం జరుగుతోంది. ఆటలలో గెలుపొందిన పిల్లలకు ఆఊరి ప్రెసిడెంట్‌గారు బహుమతులను అందజేస్తున్నారు. అందరూ సంతోషంగా చప్పట్లు కొడుతున్నారు. బహుమతులు పొందిన వారంతా ఆనందంగా అందుకుంటున్నారు. సంతోష్‌మాత్రం విచారంగా ఉన్నాడు. అతని తరగతిలో చాలామంది పిల్లలు బహుమతులు పొందారు. సంతోష్‌కు మాత్రం ఏ బహుమతీ రాలేదు. దాంతో అతను ఇంటికొచ్చి ఏడవడం మొదలుపెట్టాడు.

సంతోష్ వాళ్ళ నాన్న కారణం ఏమని కొడుకుని అడిగాడు. "నాతోటి పిల్లలంతా బహుమతులు పొందారు. నాకు ఏ బహుమతి రాలేదు. చాలా బాధగా ఉంది" అన్నాడు. "నీవు ఏ పోటీల్లోను పాల్గొనవు, ఆటలు ఆడవు, శరీరాన్ని శ్రమపెట్టవు. అందుకే నీకు చురుకుదనం లేదు. ఎప్పుడూ అనారోగ్యంగా ఉంటావు. మరి నీకు బహుమతులు ఎలా వస్తాయి? ఆటలు కేవలం సరదాకి మాత్రమేకాదు. ఆరోగ్యానికి కూడా ఎంతో మంచివి. ఈ విషయాన్ని గమనించు". అని చెప్పాడు. "అయితే నన్నేం చేయమంటావ్!" అన్నాడు సంతోష్.

"నీతోటివాళ్ళు ఏం చేస్తున్నారో గమనించు. వాళ్ళంతా వేకువనే లేచి వ్యాయామం చేస్తారు. పరుగుపెడతారు. తరువాత స్నానం చేసి మంచి ఆహారాన్ని తింటారు. సాయంత్రం కాగానే అలసిపోయేటంతగా ఆడుకుంటారు. భోజనానికి ముందు తరువాత చేతులు శుభ్రంగా కడుక్కొంటారు. అందుకే వాళ్ళంతా ఆరోగ్యంగా, చురుకుగా ఉంటారు. నీవేమో! ఏడుగంటలదాకా లేవవు. వ్యాయామం చేయవు. ఆటలాడవు ఆదరాబాదరాగా ఏదో తిని బడికి వెళతావు. మరినీకు ఇంకేం బాగుంటుంది" అన్నాడు తండ్రి.

తన తప్పు తెలుసుకున్న సంతోష్ మర్నాటి నుండి వేకువనే లేచి వ్యాయామం చేయడం, పరిశుభ్రంగా ఉండడం, చదువుతోపాటుగా ఆటల్లోనూ ఉత్సాహంగా పాల్గొనడం చేసేవాడు. ఇలా సంవత్సరం గడిచింది. వాళ్ళ పాఠశాల వార్షికోత్సవంరానే వచ్చింది. ఈసారి ఆటలపోటీల్లో చాలా బహుమతులు సంతోష్‌కే వచ్చాయి. సంతోష్ ఆనందానికి అవధులు లేవు. శరీర ఆరోగ్యానికి, ఉత్సాహానికి ఆటలు ఆడటం ఎంత అవసరమో సంతోష్‌కి అర్థమయింది.

మూలం : నైతిక విద్యాపాఠ్యక్రమము
విజ్ఞాన విహార - ఉపాధ్యాయ కరదీపిక

## 10. మూడు చేపల కథ

ఓ మడుగులో దీర్ఘ దర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, విధివాది అని పుష్టిగా పెరిగిన మూడు చేపలు తుష్టిగా జీవితం వెళ్ళబోస్తున్నాయి. దూరాలోచన గల చేప దీర్ఘదర్శి. సమయస్ఫూర్తిగల చేప ప్రాప్తకాలజ్ఞుడు. అపాయం సంభవిస్తే అప్పటికప్పుడు ఉపాయం ఆలోచించి ఆపదను బాపుకోగల తెలివి ప్రాప్తకాలజ్ఞునిది. మూడో చేపకు విధి రాతమీద విపరీతమైన విశ్వాసం. మరణం రాసిపెట్టివుంటే ఏ ప్రాణీ తప్పించుకోజాలదు అని వాదిస్తుంది కాబట్టి విధివాది అన్న పేరు దానికి సార్థకం.

ఒకనాడు దీర్ఘదర్శి తన మిత్రులిద్దరితో మాట్లాడుతూ "ఈ ఏడాది ఇంతవరకు వానలే లేవు. ఆలస్యంగానైనా ఋతుపవనాలు వస్తాయన్న ఆశ కన్పించడంలేదు. చెడు శకునాలు పొడగడుతున్నాయి. మడుగులోని నీరు పూర్తిగా అడుగంటి పోకముందే ఇక్కడ నుంచి వెళ్ళిపోవాలి. ఇక్కడికి కొంత దూరంలో ధ్రువోదంబ అనే చెరువు ఉంది. నిత్యం పుష్కలంగా నీరుండే చెరువది. అక్కడనుంచి నీరిక్కడకు వచ్చే కాలవ ఉంది. నీళ్ళుండగానే ఆ కాలువలోకి చేరి ఇక్కడ నుంచి సురక్షితంగా బయటపడదాం" అంది.

"అంత వచ్చినప్పుడు చూసుకుందాంలే!" అంది ప్రాప్తకాలజ్ఞ.

"ఇది మరీ చోద్యం!" అనుకుంది విధివాది హేళనగా.

"చెప్పడం మరచాను. ఇంతకుముందు కొందరు జాలర్లు మన మడుగు మీదుగా వెళ్తూ చెప్పుకొంటున్న మాటలు నాకు వినపడ్డాయి. 'ఒకటి, రెండు రోజులాగితే నీళ్ళు పూర్తిగా అడుగంటుతాయి. రేపో మాపో వచ్చి వలవేద్దాం' అని వాళ్ళు అనటం నేను స్పష్టంగా విన్నాను. ఆలస్యం చేస్తే అనర్థం చుట్టుముడుతుంది" అంది దీర్ఘదర్శి.

మిత్రులిద్దరూ ఏమాత్రం స్పందించలేదు. దీర్ఘదర్శి తనమటుకు తాను మడుగునుంచి బయటిపడి కాలువగుండా సరోవరం చేరుకుంది. తరువాత ఓ రోజు పోయాక జాలర్లు వలలు, అడ్డువలలు, ఇంకా కొడమ, గర్రె, మావు వగైరాలతో వచ్చి చెరువులోని చేపలన్నిటినీ సునాయాసంగా పట్టేశారు. ప్రాప్తకాలజ్ఞుడు చచ్చిపోయినట్లు తేలి పడివుండటం చూసి జాలర్లు దానిన ఒడ్డువైపు పారజిమ్మారు. అది నెమ్మదిగా కాలువలోకి దూకి తప్పించుకుంది. విధివాది జాలర్ల చేజిక్కి చచ్చిపోయింది.

## 11. కథ

ఒక గ్రామంలో రామయ్య అనే రైతు ఉండేవాడు. అతనికి మామిడి తోటలు, వ్యవసాయ భూములు చాలా ఉన్నాయి. అతనికి నలుగురు కొడుకులు.

అతని తోటలో మామిడి చెట్టుపై ఒక చిలుక గూడుకట్టుకుంది. ఆ గూట్లో చిలుక పిల్లలు నివసిస్తున్నాయి. అవి పెరిగి పెద్దవి కాసాగాయి. ఒకనాడు రామయ్య తన కొడుకులతోపాటు తోటలోకి వచ్చి కాయలు పక్వానికి వచ్చాయి. రేపు కూలీలను పిలిచి కాయలు దింపించాలి అన్నాడు. రామయ్య మాటలు విన్న చిలుక పిల్లలు, తన తల్లి గూటికి రాగానే విషయం చెప్పాయి. 'అమ్మా! రేపు ఇక్కడ్నుంచి వెళ్ళిపోదాం' అన్నాయి. కూలీలు వచ్చినప్పుడు చూద్దాం. ఇప్పుడేమీ భయంలేదు అని పిల్లలకు చిలుక ధైర్యం చెప్పింది.

కూలీలు దొరకనందున రామయ్య తక కొడుకులతో మళ్ళీ తోటలోకి వచ్చాడు. "ఇంకా ఆలస్యం చేస్తే లాభం లేదు. కూలీలు ఎంత ప్రయత్నించినా దొరకడంలేదు. మన పని మనమే చేసుకుందాం. రేపు మనమే కాయలు కోసేద్దాం" అన్నాడు. ఇది విన్న చిలుక పిల్లలు మళ్ళీ తల్లి రాగానే ఈ విషయం చెప్పాయి. తల్లి వెంటనే మనం ఇక్కడ ఉండకూడదు. వాళ్ళు రేపు తప్పకుండా వస్తారు. కాబట్టి వాళ్ళు రాకముందే మనం ఇక్కడ నుండి వెళ్ళిపోదాం" అని చెప్పి పిల్లలతో పాటు చిలుక వేరొక చోటుకు వెళ్ళిపోయి హాయిగా జీవించింది. ఎవరి శక్తి మీద వారు ఆధారపడితేనే, పనులు నెరవేరుతాయి. మన పనిని ఇతరులు చెయ్యాలనుకుంటే ఆ పని ఆలస్యమవుతుంది. పైగా, వారు బాధ్యతగా చెయ్యరు. అందుకే స్వావలంబన చాలా అవసరం.

# 5. స్ఫూర్తిదాతలు

భగత్‌సింగ్

భగత్‌సింగ్ 1907లో జన్మించాడు.
వీరు విప్లవ వీరుల కుటుంబంలో
జన్మించాడు.
లాలాలజపతిరాయ్ మరణంతో ఇతను
చెలించి లాలా మరణానికి కారణమైన
సాండర్స్‌ని కాల్చి వేశాడు.
స్వాతంత్ర్య ఉద్యమంలో అతివాదిగా
ముద్రపట్ల భగత్‌సింగ్ చరిత్రలో
నిలిచిపోయాడు.

భగత్‌సింగ్ జననం 1907 సెప్టెంబరు 22. తండ్రి పేరు కిషన్‌సింగ్, తల్లిపేరు విద్యావతీ దేవి. వీరి కుటుంబమంతా విప్లవ కార్యకలాపాలలో పాల్గొన్నదే. తండ్రి పోలీసుల నుండి తప్పించుకొని నేపాలు వెళ్లాడు. పిన తండ్రులు అజిత్ సింగ్, సువర్ణ సింగ్‌లు కూడా విప్లవ కార్యకలాపాలలో పాల్గొని జైలుకు వెళ్లినవారే. ఈయన పుట్టినరోజుననే వీరిద్దరూ విడుదలైనారు.

భగత్‌సింగ్ డి.ఎ.వి పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తి చేశాడు. నేషనల్ కాలేజీలో చేరాడు. ఇచ్చట ఆయనకు క్రాంతికారులతో పరిచయమైంది. ఇంట్లో వారంతా ఆయనకు వివాహం చేద్దామని చూశాడు. ఆయన పారిపోయి, ఢిల్లీలోని అర్జున్ పత్రికలో పనిచేయసాగాడు. అక్కడి నుండి కాన్పూరు వెళ్లిపోయాడు. ప్రతాప్ అనే దినపత్రికలో బలవంత్ సింగ్ అనే పేరుతో పనిచేయసాగాడు.

ఈయనకు తల్లి యెడల అమితమైన ప్రేమ. క్రమంగా విప్లవ కార్యకలాపాలలో తీవ్రంగా పనిచేయ మొదలుపెట్టాడు. పంజాబులోని పేరెన్నికగన్న విప్లవవీరులలో ఒకరుగా ఈయన ప్రసిద్ధిగాంచాడు. లాహూరులో 1928 అక్టోబరులో సైమను కమీషన్‌కు వ్యతిరేకంగా లాలాలజపతిరాయ్ పెద్ద ఉద్యమం లేవదీశాడు. లాఠీ చార్జీలో లజపతిరాయ్ తీవ్రంగా గాయపడి, మరణించాడు. దీనికి ప్రతీకారం చేయదలిచాడు. భగత్‌సింగ్, లాఠీచార్జీ చేసిన డి.ఎస్.పి. సాండర్స్‌ను లాలాజీ ప్రథమ మాసికం రోజుననే భగత్‌సింగ్, ఆజాద్, రాజగురులు కలిసి పోలీసు స్టేషన్ వద్ద కాల్చి చంపారు.

పార్లమెంటు భవనంలో భగత్‌సింగ్, బటుకేశ్వరదత్త, సుఖదేవు, రాజగురు మున్నగు విప్లవకారులు 1929 ఏప్రిల్ 8న బాంబులు విసిరారు. "వందేమాతరం" "విప్లపవం వర్ధిల్లాలి" అంటూ నినాదాలు చేసి నిర్బంధింపబడ్డారు.

కాకోరి కుట్ర కేసులో భగత్‌సింగ్ ఆజాద్ వెంట ఉన్నాడు. విప్లవ వీరుల సంఘటనా కార్యంలో చంద్రశేఖర్ ఆజాద్, భగత్‌సింగ్‌లు జంటగా పనిచేశారు.

1930 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవులకు ఉరిశిక్ష విధించారు. చిరునవ్వుతో పోటీపడుతూ ఆ ముగ్గురూ ఉరికంబాలెక్కారు. వారు తమ బలిదానంతో భారత ఇతిహాసంలో అమరులయ్యారు. భారత స్వాతంత్ర్య సౌధానికి పునాది శిలలయ్యారు. విప్లవ కార్యానికి తమ ఆహుతి ద్వారా ప్రాణం పోశారు. విప్లవ జ్వాల అణగారలేదు. రగులుతూనే ఉందనిపించారు. వారి జీవితం ధన్యమైంది.

సుభాష్ చంద్రబోసు

స్వాతంత్ర సమరయోధులలో ముఖ్యమైన వారు సుభాష్ చంద్రబోసు 1897లో జన్మించాడు. చిన్నప్పటి నుండే ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకతను పెంచుకొన్నాడు. 'ఆజాద్ హిందు ఫౌజు'ను స్థాపించి బ్రిటిషర్స్ ఎదురించిన యోధుడు.

సుభాష్ చంద్రబోసు ఉత్కళ ప్రాంతంలోని కటక్‌లో 1897 జనవరిలో జన్మించారు. జానకీనాథబసు, ప్రభావతి దేవి ఇతని తల్లిదండ్రులు. చిన్నప్పటి నుండి స్వాభిమానంతో, పట్టుదలతో ఉండేవారు. సుభాష్ కుటుంబం సంపన్నమైనదైనప్పటికీ స్వావలంబనతో జీవించేవారు. ఎవరి పనులు వారు చేసుకొనేవారు. ప్రొటస్టెంట్ యూరోపియన్ స్కూల్లో చదువుతున్నప్పుడు భారతీయులను కొడుతున్న ఆంగ్లేయుల పిల్లల్ని ఎదిరించి చావబాదాడు. దేశభక్తి గలవాడు. స్వాతంత్ర్యం కోసం పోరాడిన విప్లవ వీరుల చిత్రాలను అతికించి నేను కూడా ఇలాగే జీవించాలి. నేను కూడా ఇలానే మరణించాలి అని వ్రాశాడు.

సుభాష్ కటక్‌లో స్వేచ్ఛాసంఘ్‌ను స్థాపించి చుట్టు ప్రక్కల గ్రామాలలో సేవా కార్యక్రమాలు జరిపేవాడు. 1919 జలియన్ వాలా బాగ్‌లో భారతీయులపై జరిగిన అమానుష చర్యలకు కలత చెంది ఇంగ్లాండులో ఐపియస్ చదువుతున్న సుభాష్ 1920లో రాజీనామా చేసి, స్వాతంత్ర ఉద్యమంలో దూకారు.

నా జీవితం వివేకానందుని ప్రభావంతో రూపొందింది. అతని దేశభక్తి భావాలు నా నరనరాల్లో, రక్తనాళాల్లో లావాలాగ ప్రవహించి నన్ను ఉత్తేజపరుస్తూ మున్ముందుకు నడిపిస్తున్నాయి" అని సగర్వంగా చెప్పుకున్నాడు. స్వాతంత్ర్య పోరాటంలో అతను చూపించిన అసమాన ధైర్యసాహసాలు, గంభీరత అందర్నీ ముగ్ధుల్ని చేశాయి. 1938 అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షులై కార్యకర్తలలో చైతన్యం ఉత్సాహం నింపారు.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమయ్యాక ఆంగ్ల ప్రభుత్వం సుభాష్‌ను నిర్బంధించింది. 1941లో నిర్బంధం నుండి తప్పించుకొని జర్మనీ వెళ్లి స్వాతంత్ర్య ఉద్యమం గురించి హిట్లర్‌కు విన్నవించాడు. భారతీయులందర్నీ సమీకరించి, 1942 జనవరి 26న ఆజాద్ హింద్ ఫౌజ్ అనే స్వతంత్ర్య జాతీయ సైన్యాన్ని రూపొందించాడు. జపాన్ దేశం అండమాన్ నికోబార్ దీవుల్ని నేతాజీకి స్వాధీనం చేసింది. 1943 అక్టోబరు 21న అక్కడ తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పరిచి

దాని నిర్వహణకు నిధులు సేకరించిన స్వాభిమాని. ఢిల్లీ ఛలో, జైహింద్ వంటి నినాదాలిస్తూ ప్రజల్ని స్వాతంత్ర పోరాటంలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు చేసిన వ్యక్తి నేతాజీ. 1945 ఆగష్టు 18న ఫార్మోజా సమీపంలో విమాన ప్రమాదంలో మరణించినట్లుగా టోక్యో రేడియో ప్రకటించింది. కాని, అది నిజం కాదని అధికారులు కొట్టివేశారు. దాంతో నేతాజీ చరమాంకం గురించి నేటికీ అంతుచిక్కని రహస్యమే.

స్వాభిమానం, శౌర్యం, ధైర్యం, సంఘటనా కుశలతగల నేతాజీ సమాజ శ్రేయస్సుకు, స్వాతంత్ర్య సాధనకు తన జీవితాన్ని పూర్తిగా వినియోగించిన మహానుభావుడు.

## చంద్రశేఖర్ ఆజాద్

**గాంధీజి సహాయ నిరాకరణతో స్వాతంత్ర్యోదమంలో పాల్గొన్న చంద్రశేఖర్ ఆజాద్ 1905లో జన్మించాడు. భగత్‌సింగ్‌తో కలిసి స్వాతంత్రోద్యమంలో ఆంగ్లేయులను ఎదిరించాడు. చివరికి వారి చేతిలో చావవద్దని తనని తాను కాల్చుకున్నాడు.**

ఆజాద్ జననం 1905వ సంవత్సరం మధ్యప్రదేశ్‌లలోని "బావరా" గ్రామంలో జరిగింది. తండ్రి పేరు సీతారాంజీ తివారి. తల్లి పేరు జుగరాణి. వీరిది నిరుపేద కుటుంబము.

ఈయన కాశీలో సంస్కృతం చదవటానికి వెళ్లాడు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో దూకాడు. ఆయనను పోలీసులు నిర్బంధించారు. కోర్టులో జడ్జీ "నీ పేరు?" అని ప్రశ్నించగా "జైలు" అని సమాధానం ఇచ్చాడు. ఇదివిన్న మెజిస్ట్రేటు 15 బెత్తం దెబ్బలు కొట్టమని ఆజ్ఞాపించాడు. దెబ్బ దెబ్బకు "వందేమాతరం" "మహాత్మా గాంధీకి జై" అని ఆయన నినదించాడు. కాకోరి రైలు దోపిడీలో పాల్గొన్న నలుగురిలో ఈయన ఒకడు. ఆయన, సర్దార్ భగత్‌సింగ్‌తో కలిసి పనిచేశారు. వీరితో రామ ప్రసాద్ బిస్మిల్, రాజేంద్రనాథ్ లోహిడి, అస్ఫాక్ ఉల్లాఖాన్, రోషన్ సింగ్‌లు ఉన్నారు.

ఈయన ఒక నేర్పరియైన విప్లవకారుడు. కాకోరి ఉదంతానికి నేత ఆయనే. భగత్‌సింగ్‌ని తప్పించి తానే పట్టుబడదలచాడు. రామప్రసాద్ బిస్మిల్‌తో కలిసి ప్రభుత్వ ఖజానాలు దోచాడు. ఈయన జవహర్‌లాల్ నెహ్రూతో కూడా కలిశాడు. ఈయన జీవితాంతం ఆంగ్లేయులకు పట్టుబడకుండా "ఆజాద్"గా ఉంటానని ప్రతిజ్ఞ చేశాడు. ఈయన జీవితం "ఆజాద్" గానే సమాప్తమైంది.

దరిద్రంతో గడిచినా ఉత్తమ శీల సంపన్న జీవితం ఆయనది. ఈయనను నిర్బంధించడానికి పోలీసులు వెంటపడ్డారు. 1931 సంవత్సరం ఫిబ్రవరి 27వ తేదీన అలహాబాదులో ఆల్‌ఫ్రెడ్ పార్కులో కూర్చుండి ఉండగా ఈయన్ని పోలీసులు చుట్టుముట్టారు. నాట్ వాపర్ అనే వాడు గుండు పేల్చాడు. అది ఇతని పిక్క ఎముకను చిత్తు చేసింది. రెండవది కుడి భుజానికి తగిలింది. ఇంతలో ఆజాద్ కూడా పిస్తోలుతో వాణ్ణి కాల్చాడు. వాడు పరిగెత్తి చెట్టు చాటున దాక్కున్నాడు. ఆజాద్ కూడా చెట్టును చాటు చేసుకొన్నాడు. తిట్టుతూ వచ్చిన ఎస్.పి.ని క్రింద పడేడట్టు కొట్టాడు. చివరకు పోలీసులకు ప్రాణాలతో చిక్కకుండా తనను తాను పేల్చుకొని అక్కడే చనిపోయాడు. ప్రాణంతో పోలీసులకు దొరకనన్నాడు. అందుకే తనను తాను పేల్చుకొన్నాడు. విప్లవవీరులకు మకుటంగా జీవించాడు చంద్రశేఖర్ ఆజాద్.

ఝాన్సీ లక్ష్మీబాయి

ఆంగ్లేయులను గడగడలాడించిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి. 1827లో జన్మించిన ఈమె ఝాన్సీకి మహారాణిగా పరిపాలించిన సమయంలో ఆంగ్లేయులను ఎదురించి వీర మరణం పొందింది.

భారతదేశ చరిత్రలో ఎందరో వీరులు, శూరులు ఉన్నారు. బ్రిటీష్ వారిని ఎదిరించిన వీరనారీమణులలో ఝాన్సీరాణి లక్ష్మీబాయి గొప్ప పేరు పొందినది.

ఝాన్సీ లక్ష్మీబాయి 1827వ సంవత్సరం బనారస్‌లో జన్మించింది. ఆమె తల్లిదండ్రులు – మోరోపంత్ తాంబె, బటీరరథీబాయి, లక్ష్మీబాయిని ముద్దుగా మనూ అని పిలిచేవారు. అమ్మ చెప్పే రామాయణ, మహాభారత కథలంటే మనూకి చాలా ఇష్టం.

మనూకి 4 సంవత్సరాల వయసులో అకస్మాత్తుగా తల్లి చనిపోయింది. మోరోపంత్ తన నివాసాన్ని బనారస్ నుండి బీరూర్‌కు మార్చాడు. మనూకు తన బాధను మరచిపోయేందుకు ఎక్కువకాలం పట్టలేదు. ఆమెకు అక్కడ నానాసాహెబ్, తాంతియాతోపేలతో స్నేహం లభించింది. వారితో కలిసి ఆమె గుర్రపుస్వారీ, తుపాకి పేల్చడం వంటివి నేర్చుకుంది. వాళ్ళతో పాటె బడికి వెళ్ళి చదువుకునేది.

ఝాన్సీని పాలించే గంగాధర్‌రావు మనూని పెండ్లి చేసుకొన్నాడు. అప్పటి నుండి మనూ పేరు లక్ష్మీబాయి, ఝాన్సిరాణిగా మారిపోయింది. భర్త చనిపోయిన తరువాత ఆమె 'ఝాన్సి'కి రాణి అయింది. ఆ సమయంలో ఆంగ్లేయులు మన దేశాన్ని మొత్తం ఆక్రమించేశారు. వీరు ఝాన్సీ ప్రాంతాన్ని కూడా ఆక్రమించాలనుకొన్నారు. అప్పుడు లక్ష్మీబాయి తాను కోటలో రహస్యంగా దాచిన ఆయుధాలను వెలికి తీయించింది. తుఫాకులు, కత్తులు తయారుచేసి కర్మాగారాలను ఏర్పాటుచేసింది. వేలాది మంది స్త్రీపురుషులకు యుద్ధ విద్యలో శిక్షణ ఇప్పించింది. సైన్యాన్ని పెంపుచేసింది.

గుర్రంపై స్వారీ చేస్తూ ప్రతి చోటుకూ వెళ్ళి లక్ష్మీబాయి తాము చేస్తున్న పనిని పరిశీలించింది. తన చిన్నారి దామోదర్‌ను నడుముకు కట్టుకొని గుర్రంపై స్వారీ చేస్తూ ఉండేది.

ఆంగ్ల సైనికులు 'ఝాన్సి' రాజ్యాన్ని ముట్టడించడానికి వచ్చారు. ఆంగ్లేయుల ఫిరంగులు కోట గోడలను పేల్చివేశాయి. గోడలు పగిలిపోయాయి. బ్రిటీష్ సేనలు కోటలోకి దూసుకుపోయాయి.

ఝాన్సీ ప్రజలకు, బ్రిటీష్ వారికి గొప్ప యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో లక్ష్మీబాయి సైనికులు చాలా మంది చనిపోయారు. రాణి శత్రువుల కళ్ళు గప్పి తప్పించుకొంది. తన బిడ్డ దామోదర్‌ను శాలువతో తన వీపుకు కట్టుకొని గుర్రంపైకి దూకి కోట కింది భాగం నుండి వెళ్ళిపోయింది.

మరొకసారి ఆంగ్లేయులకు లక్ష్మీబాయికి యుద్ధం జరిగింది. లక్ష్మీబాయి రెండు చేతులతో రెండు కత్తులు పట్టుకొంది.

గుర్రం పగ్గాలను నోటితో పట్టుకొని ఒక్కొక్కరిని చీల్చి చెండాడసాగింది. ఇలా రెండు రోజులు భయంకరమైన యుద్ధం జరిగింది. మూడవ రోజున ఒక అనామక సైనికుని కాల్పులకు గాయపడింది. ఆమె గ్వాలియర్ కోటవద్ద సరాయి ప్రాంతంలో పడిపోయింది. ఆమె సైనికులు వెంటనే అక్కడికి చేరుకొన్నారు. "నా వజ్రాల నగలను సైనికులకు ఇవ్వండి. నా బిడ్డ దామోదర్‌ను చక్కగా పెంచండి అని చెబుతూ చనిపోయింది.

## జగదీష్ చంద్రబోసు

**మొక్కలకు కూడా ప్రాణం ఉంటుందని ఋజువు చేసి ప్రపంచ వైజ్ఞానికులలో ఒకడిగా పేరు గడించాడు – జగదీష్ చంద్రబోసు. ఇతను 1894లో జన్మించి వృక్ష, భౌతిక శాస్త్రాలలో అనేక పరిశోధనలు చేశాడు.**

భారతీయ ఆధునిక వైజ్ఞాకులలో జగదీష్ చంద్రబోసు తలమానికం వంటివారు. క్రీ.శ.1858 నవంబర్ 30వ తేదీన బెంగాల్‌లోని మైమెన్ సింగ్‌లో జన్మించారు. ఇంగ్లాండులో విద్యాభ్యాసం పూర్తి చేసుకొని కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేశారు. వృక్షశాస్త్రంలోను, భౌతిక శాస్త్రంలోను అధ్యయనం చేసేవారు. ప్రకృతిని పరిశీలించారు. మార్కోని కనిపెట్టాడని చెప్పబడుతున్న ఎలక్ట్రోమాగ్నటిక్ రేడియో వేవ్స్ ఆధారంగా పనిచేసే వైర్‌లెస్ టెలిగ్రాఫ్‌ను అతను 1894లోనే కనిపెట్టి ప్రయోగాత్మకంగా నిరూపించారు. రేడియో వేవ్స్‌ను తెల్సుకునే కామెరర్ పరికరాన్ని కూడా అతను కనిపెట్టారు.

మొక్కలకు కూడా ప్రాణం ఉంది. అవి స్పందిస్తాయి. దీనిని ఋజువు పరిచేందుకు జగదీశ్ చంద్రబోసు ఇంగ్లాండు వెళ్ళారు. శాస్త్రజ్ఞులతో కూడిన సభలో ఆవిషయాన్ని నిరూపించాలనుకున్నారు. బోసు ఒక మొక్కకు ఇంజెక్షన్ ఇచ్చి దానిని ఋజువు చెయ్యాలనుకున్నారు. విషప్రభావం చెట్లపై కూడా ఉంటుందని, ఇతర ప్రాణుల్లో వలే వాటిలో కూడా ప్రతిక్రియ ఉంటుందని చెప్పదల్చుకున్నాడు. ఒక మొక్కకు విషపు ఇంజెక్షన్ ఇచ్చారు కాని దానిలో మార్పు కనిపించలేదు. మొదట ఎలా ఉందో అలాగే ఉంది. అప్పుడు జగదీశ్ చంద్రబోసు అదే ఇంజెక్షన్ తాను కూడా చేసుకున్నాడు. బోసుకు కూడా ఏమీ కాలేదు. అప్పుడు ఇంజెక్షన్ పరీక్షిస్తే అది విషం కాదని తేలింది. తరవాత నిజమైన విషపు ఇంజెక్షన్ మొక్కకు చేస్తే దాని ప్రభావం తెలియవచ్చింది. దాంతో చంద్రబోసు చెట్లకు ప్రాణం ఉందన్న విషయాన్ని సునాయాసంగా నిరూపించి అందరి ప్రశంసలు పొందారు.